మానేరు **జనత** ®
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

## ఇంగ్లండ్‌పై భారత్ ఘన విజయం
సిరీస్ కైవసం


07

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

1.2.2025 శనివారం Saturday | సంపుటి (Volume): 09 సంచిక (Issue) : 292 | పేజీలు : 8 Pages : 8 | Published from : Karimnagar



## దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా బడ్జెట్
సమావేశాలకు ప్రతిపక్షాలు సహకరించాలి
మీడియాతో ప్రధాని మోడీ ఆకాంక్ష
04

## ప్రపంచంలో మూడో ఆర్థికశక్తిగా భారత్
సామాజిక, ఆర్థిక, రాజకీయ సుస్థిరతతో ఆదర్శం
పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి


04



# చెల్లని వెయ్యినోటు కేసీఆర్

- తెలంగాణను అప్పలకుప్పగా చేసిన ఘనుడు
- పదేళ్లలో 7లక్షల కోట్లు అప్పు చేసి..దనిక రాష్ట్రమని అబద్దాలు
- ఫామ్‌హౌజ్ జీవితంతో ప్రజలకు సంబంధాలు తెగిపోయాయి
- ఎవరేం చేశారో లెక్కలు చెప్పడానికి నేను సిద్ధం
- అసెంబ్లీకి వస్తే లెక్కలు చెబుతా.. ఎవరేం చేశారో తేలుద్దాం
- టిక్‌టాక్ లైకులతో సంబరపడి పోతున్న కేసీఆర్
- మొగిలిగిద్ద సభలో నిప్పులు చెరిగిన సీఎం రేవంత్ రెడ్డి

రంగారెడ్డి, జనతా న్యూస్: ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చి, రాష్ట్రపై ఏడు లక్షల కోట్లు అప్పు పెట్టిన కెసిఆర్, చెల్లని వేయిరూపాయిల నోటు లాంటి వాడని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కేసీఆర్ రద్దయిన వెయ్యి నోటు లాంటి వారు.. ఆయనకు విలువలేదు. ఫామ్‌హౌస్‌లో ఉన్న ఆయనకు ప్రజలతో సంబంధాలు తెగిపోయినట్లున్నాయి. ఇప్పుడు మెదడు కూడా సరిగా పనిచేయడం లేదని ఘాటు విమర్శలు చేశారు. ప్రజలు తిరస్కరించినా భారాస మారలేదు. రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా జరిగిన సభలో సీఎం ప్రసంగించారు. గట్టిగా కట్టె పట్టుకుని నిలబడలేదు...గంభీరంగా గమనిస్తున్నారట..ఆయన కొడుకును, అల్లుడిని అచ్చోసిన ఆంబోతుల్లా వదిలారు...అంటూ ఘాటు విమర్శలు చేశారు. రూ.7లక్షల కోట్లు అప్పు చేసి 2023లో మాకు అప్పగించారు. గత ప్రభుత్వం రూ.18వేల కోట్లే రుణమాఫీ చేసింది.

మిగతా 2 లో

## విద్యారంగంపై ప్రత్యేక దృష్టి
- టీచర్ పోస్టులు భర్తీ చేసిన ఘనత మాదే
- మొగిలిగిద్ద పాఠశాల సభలో రేవంత్


02

## గోషామహల్‌లో ఉస్మానియా ఆస్పత్రి
అట్టహాసంగా సిఎం రేవంత్ శంకుస్థాపన
02

### నేను కొడితే మామూలుగా
# ఉండదు
### గట్టిగా కొట్టడం తనకు అలవాటు

- కాంగ్రెస్ ఏడాది పాలనలోనే రాష్ట్రం దివాళా
- అప్పుడే కరెంట్ కోతలు..నీటి సమస్యలు
- ప్రాజెక్టులను పూర్తిగా పండబెట్టారు
- గురుకులాల్లో పురుగుల అన్నం పెడుతున్నారు
- కాంగ్రెస్ వాళ్లు కనబడితే జనాలు కొట్టేలా ఉన్నారు
- నేను చెప్పినా వినకుండా కాంగ్రెస్‌కు ఓటేసి అనుభవిస్తున్నారు
- జహీరాబాద్ నేతల భేటీలో కేసీఆర్ ఘాటు వ్యాఖ్యలు


03

సుదీర్ఘ కాలం తర్వాత మాజీ సీఎం కేసీఆర్ మౌనం వీడారు. 'నేను కొడితే మాములుగా ఉండదు' అంటూ కాంగ్రెస్ పాలనపై నిప్పులు చెరిగారు. కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలు ఈ నెల 27న జహీరాబాద్ నుంచి పాదయాత్రగా శుక్రవారం ఎర్రవల్లికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో కేసీఆర్ సమావేశమయ్యారు. 'ఇన్ని రోజులుగా నేను మౌనంగా ఉన్నా.. గంభీరంగా చూస్తున్నా. నేను కొడితే మామూలుగా ఉండదు. తెలంగాణ శక్తి ఏందో కాంగ్రెస్ వాళ్లకు చూపించి మెడలు వంచుతా. కాంగ్రెస్ వాళ్లు దొరికితే ప్రజలు కొట్టేలా ఉన్నారు. తులం బంగారానికి ఆశపడి కాంగ్రెస్‌కు ఓటేశారు'.. అని అన్నారు.


02

## చర్యలు ఎప్పుడు?
- ఎమ్మెల్యే అనర్హత పిటిషన్‌పై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు



## బిగ్ అలర్ట్..
- రాష్ట్రంలో తొలి జీబీఎస్ కేసు
- ఓ మహిళకు జీబీఎస్ పాజిటివ్ నిర్ధారణ
- ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స

02

## వారం రోజులుగా తల్లి శవంతో ఇంట్లోనే కూతుళ్లు
- అంత్యక్రియలకు డబ్బులు లేక.. ఎవరికీ చెప్పలేదన్న వాదన
- తల్లి మరణంతో డిప్రెషన్‌లోకి వెళ్లారని మరో కథనం
- విషయం తెలుసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు

02




## బీఆర్ఎస్ హయాంలో పట్టణాభివృద్ధికి ప్రణాళిక
- ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేశాం
- ఉమ్మడి ఏపీలో పట్టణాల అధ్వాన్నం
- కాంగ్రెస్ హయాంలో మళ్లీ యధాతథ స్థితి
- తెలంగాణ భవన్‌లో కేటీఆర్

03




02

### రాష్ట్రపతి ప్రసంగంపై
## సోనియా, రాహుల్ విమర్శలు
- తీవ్రంగా స్పందించిన బిజెపి అధ్యక్షుడు నడ్డా

### ఫోన్ ట్యాప్ కేసులో
## ఇద్దరి విడుదల
- చంచల్‌గూడ జైలు నుంచి బయటికి వచ్చిన భుజంగరావు, రాధాకిషన్ రావు


02



## ఎమ్మెల్యే అనర్హతపై చర్యలు ఎప్పుడు?

**హైదరాబాద్, జనవరి 31:** తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వ్యవహారంపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌషిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ జార్జి మైస్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. హైకోర్టు నాలుగు నెలల్లో ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని గత ఏడాది మార్చిలో చెప్పినా ఇంత వరకు నిర్ణయం తీసుకోలేదని కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తగిన సమయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవడం లేదని న్యాయవాది తెలిపారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చామని అసెంబ్లీ కార్యదర్శి తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి.. కోర్టుకు చెప్పారు. నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్ ఎమ్మెల్యేలకు తగిన సమయం ఇవ్వాలని గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిందని రోహత్గి గుర్తు చేశారు. "బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడానికి... మీ దృష్టిలో తగిన సమయం అంటే ఎంత? రీజనబుల్ టైమ్ అంటే.. మహారాష్ట్ర తరహాలో శాసనసభ గడువు ముగిసేవరకా?" అంటూ తెలంగాణ స్పీకర్‌ను సుప్రీం ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. స్పీకర్‌ను అడిగి నిర్ణయం చెపుతామని సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి తెలిపారు. ఎంత సమయం కావాలో మీరే స్పీకర్‌ను కనుక్కొని చెప్పాలని రోహత్గికి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం సూచించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి సుప్రీం కోర్టు వాయిదా వేసింది. సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్ , తెల్ల వెంకటరావుపై అనర్హత వేటు వేయాలనే పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద ఈ పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ పై గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి కడియం, దానం నాగేందర్ , తెల్ల వెంకటరావు సహా పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారు. దీనిపై జస్టిస్ బి ఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జ్ ధర్మాసనం విచారణ జరిపింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు తెల్లం, కడియం, దానంపై స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపులపై నాలుగు వారాల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్ వేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు తెలంగాణ స్పీకర్ కనీసం నోటీసు ఇవ్వలేదని పిటిషన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

## రాష్ట్రంలో తొలి జీబీఎస్ కేసు

**హైదరాబాద్, జనవరి 31:** దేశంలో గులియన్ బారే సిండ్రోమ్ కలకలం సృష్టిస్తోంది. ఈ కేసులు పెరుగుతుండడం భయాందోళనలను రేకెత్తిస్తోంది రాష్ట్రంలో తొలి గులియన్ బారే సిండ్రోమ్(జీబీఎస్) కేసు నమోదైంది. హైదరాబాద్‌లో జీబీఎస్ కేసును వైద్యులు గుర్తించారు. సిద్దిపేటకు చెందిన మహిళకు జీబీఎస్ లక్షణాలు ఉండడంతో హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. బాధిత మహిళ వెంటిలేటర్ పై చికిత్స పొందుతోంది. పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలో ఇదివరకే దాదాపు 100కు పైగా జీబీఎస్ కేసులు నమోదు కావడం ఆందోళనకు గురి చేస్తోంది. బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్ కారణంగా ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నవారు ఈ జీబీఎస్ బారిన పడే అవకాశాలు ఉన్నాయని వైద్యులు వెల్లడించారు. శరీరానికి సోకిన ఇన్ ఫెక్షన్ కు ప్రతిస్పందించే రోగ నిరోధక వ్యవస్థ పొరపాటున నరాలపై దాడి చేసే అరుదైన పరిస్థితే ఈ జీబీఎస్. మోడీకి ట్రంప్ తాజా ఆఫర్..! సై అంటే మీ వాళ్ల జోలికి రాం..? ఈ వ్యాధి బారిన పడిన వారికి ఒళ్లంతా తిమ్మిరిగా మారుతుంది. కండరాలు బలహీనంగా మారిపోతాయి. డయేరియా, పొత్తికడుపులో నొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. జలుబు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటివి కూడా కనిపిస్తాయి. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఈ బ్యాక్టీరియా సోకుతుందని డాక్టర్లు చెబుతున్నారు. అయితే జీబీఎస్ అంటువ్యాధి కాదని.. ఎవరూ భయాందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తున్నారు. బాధితులకు సరైన చికిత్స అందిస్తే కోలుకుంటారని చెబుతున్నారు. అయితే దీని చికిత్స చాలా ఖరీదైనదని.. రోగికి ఇచ్చే ఇమ్యునోగ్లోబిన్ ఇంజెక్షన్ ధర ఒక్కొక్కటి వేలల్లో ఉంటుందని చెబుతున్నారు. ఈ వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే రోగ నిరోధక శక్తి అధికంగా ఉండాలి. ఎందుకంటే రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఈ వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ వ్యాధి ప్రభావం వల్ల రోగనిరోధక శక్తి పూర్తిగా దెబ్బతిని నరాల వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

## వారం రోజులుగా
## తల్లి శవంతో ఇంట్లోనే కూతుళ్లు



**హైదరాబాద్,జనవరి31 :** అకస్మాత్తుగా తల్లి మరణం.. ఆమె ఇద్దరు కుమార్తెలను మానసికంగా కుంగిపోయేలా చేసింది. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో తల్లి మృతదేహంతో ఒకే ఇంట్లో నాలుగు రోజులుగా ఉండిపోయారు కుమార్తెలు. ఈ హృదయవిదారక ఘటన సికింద్రాబాద్ వారాసిగూడలో ఆలస్యంగా వెలుగుచూసింది.వివరాల్లోకి వెళ్తే.. సికింద్రాబాద్ వారాసిగూడ పోలీసుస్టేషన్ పరిధిలోని బౌద్ధనగర్‌లో లలిత అనే మహిళ మృతిచెందారు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు.. లలిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. లలిత చనిపోయి నాలుగు రోజులవుతోందని పోలీసులు భావిస్తున్నారు. ఆమె గుండెపోటుతో మరణించిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధరణకు వచ్చారు. తల్లి అకస్మాత్తుగా చనిపోవడంతో ఆమె ఇద్దరు కుమార్తెలు రవళిక, యశ్విత మానసిక ఒత్తిడికి గురయ్యారు. ఏం చేయాలో తెలియక నాలుగు రోజులపాటు అదే ఇంట్లో ఒక గదిలో తల్లి మృతదేహాన్ని ఉంచి, మరో గదిలో వారిద్దరూ ఉన్నట్లు తెలుస్తోంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని వారాసిగూడ పోలీసులు తెలిపారు. అయితే మరో కథనం కూడా ఇందులో ఉంది. సికింద్రాబాద్ వారాసిగూడలో వెలుగులోకి వచ్చిన ఘటన.. అందరికీ కన్నీళ్లు తెప్పిస్తుంది. తల్లి చనిపోయి వారం రోజులు అవుతుంటే.. అంత్యక్రియలకు డబ్బులు లేక ఇంట్లోనే వారం రోజులు.. తల్లి శవంతో గడిపిన ఆ ఇద్దరు పిల్లల మానసిక పరిస్థితి ఏంటన్నది చర్చ సాగుతోంది. బౌద్ధనగర్‌లో లలిత (45) తన ఇద్దరు కూతుర్లు రవళిక (25), అశ్విత (23)తో కలిసి నివాసం ఉంటుంది. కరోనా సమయంలో లలిత భర్త కుటుంబాన్ని వదిలి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇద్దరు ఆడకూతుర్ల బాగోగులు లలితనే చూసుకుంటుంది. ఈ క్రమంలోనే లలిత అనారోగ్యానికి గురి అయ్యింది. ట్రీట్మెంట్ చేయించుకునేందుకు డబ్బులు లేకపోవడంతో అలాగే ఇంట్లో ఉంటుంది. దీంతో ఆరోగ్యం మరింత విషమించి జనవరి 23న అంటే తొమ్మిది రోజుల క్రితం లలిత మరణించింది. తల్లి మరణంతో డిప్రెషన్ లోకి వెళ్లిన కూతుర్లు.. దహన సంస్కారాలకు డబ్బులు లేక తల్లి మరణవార్తను ఎవరికీ చెప్పలేదు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి చూడగా లలిత మృతి చెంది ఉంది. కూతుళ్లను ప్రశ్నించగా.. జనవరి 23వ తేదీన తమ తల్లి చనిపోయిందని.. అంత్యక్రియలకు డబ్బులు లేకపోవడంతో విషయాన్ని ఎవరికీ చెప్పలేదన్నారు. మొదట ఖంగుతున్న పోలీసులు.. చివరకు అర్థం చేసుకుని లలిత మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. తల్లి శవంతోటే ఇద్దరు కూతుర్లు తొమ్మిది రోజుల పాటు ఇంట్లో ఉన్నారన్న విషయం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. లలిత మృతికి గల కారణం ఏంటన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# చెల్లని వెయ్యినోటు కేసీఆర్

మొదటి పేజీ తరువాయి

గత ప్రభుత్వం చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోయింది. మేం అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేశాం. రుణమాఫీ చేయలేదంటున్న కేసీఆర్ అసెంబ్లీకి వస్తే లెక్కలు చెబుతాం. ఫామ్‌హౌస్‌లో ఉండి సోది చెప్పటం కాదు.. అసెంబ్లీకి రండి.. లెక్కలు చెబుతాం. ఏ గ్రామంలో ఏ రైతుకు ఎంత రుణ మాఫీ చేశామో శాసనసభలో పెడతాం. కేసీఆర్‌కు చిత్తశుద్ధి, నిజాయతీ ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి. రైతు భరోసా ఎగ్గొడతారని కేసీఆర్ చెబుతున్నారు. మీలాగా మాట తప్పే వ్యక్తిని కాదు. దళితులకు 3 ఎకరాల భూమి, దళిత ముఖ్యమంత్రి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అని అనేక హామీలు ఇచ్చి మాట తప్పిన చరిత్ర కేసీఆర్‌ది. పదేళ్లు పాలించి ప్రజల దగ్గరకు వెళ్తే పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయారు. పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చి.. ఇక్కడి ప్రాజెక్టులను పండబెట్టారని విమర్శలు గుప్పించారు. భారాస పదేళ్లలో ఇవ్వలేని ఉద్యోగాలను ఏడాదిలో ఇచ్చాం. సోషల్ మీడియాలో నాకంటే ఎక్కువ లైక్‌లు వచ్చాయంటు న్నారు. కేంద్రమంత్రి, సీఎంగా చేసిన కేసీఆర్ సోషల్ మీడియాలో లైక్‌లు చూసి సంబరపడుతున్నారు. అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొంటే. మీరో.. నేనో తేల్చుకుందాం. ప్రజలు బాధపడుతున్నారని కేసీఆర్ అంటున్నారు. ఎవరూ బాధపడటం లేదు. రూ. 2లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఫీజురీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ రూ. 10లక్షలు, రైతు భరోసా పథకాలు అమలు చేస్తున్నాం' అని సీఎం వివరించారు. తెలంగాణను ధనిక రాష్ట్రంగా మార్చినట్లు ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి, గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నిర్ణయాలను విమర్శించారు. తెలంగాణను అప్పుల నుంచి గట్టెక్కించినట్లు ధ్వజమెత్తారు. 2023లో మా వద్దకి రూ. 7 లక్షల కోట్లు అప్పు చేయడంతో వచ్చిన తెలంగాణ ప్రభుత్వం, గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ. 18వేల కోట్ల రుణమాఫీ మాత్రమే చేసింది. ఈ రుణమాఫీ వడ్డీలకే సరిపోయింది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని అన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి లెక్కలు చెబుతారని నమ్ముతుంటే, ఆయన ఫామ్‌హౌస్‌లో ఉండి సోది మాట్లాడటం కాదు, నిజం



చెప్పాలి. అసెంబ్లీకి రమ్మని, రైతులకు ఎన్ని రుణమాఫీలు చేశామో అసెంబ్లీ ముందు వివరంగా చెప్పాలని అన్నారు. కేసీఆర్ కు చిత్తశుద్ధి ఉంటే, అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి. దళితుల కోసం 3 ఎకరాల భూమి, దళిత సీఎం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వంటి హామీలను ఇచ్చి మాట తప్పిన చరిత్ర కేసీఆర్ కు ఉంటే, అది ప్రజల్ని మోసం చేయడమే అని రేవంత్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. పదేళ్ల పాటు పాలించిన కేసీఆర్, ప్రజల నుంచి తప్పించి పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయారు. పాలమూరు ప్రాజెక్టుల గురించి హామీ ఇచ్చి, స్వంత ప్రాజెక్టులలో రుణాలు చెయ్యడమే అన్యాయంగా ఉందన్నారు. అంతేకాకుండా..'అసెంబ్లీ ఎన్నికలను అడ్డు పెట్టుకుని రైతు బంధు ఎగ్గొట్టిన చరిత్ర కేసీఆర్‌ది. ఆయన ఎగ్గొట్టిన రైతు భరోసా నిధులను మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల ఖాతాలో వేశాం. 2014 నుంచి 2023 డిసెంబర్ వరకు కేసీఆర్ చేసిన రైతు రుణమాఫీ కేవలం రూ. 18వేల కోట్లు మాత్రమే. ఇందులో మిత్తికి పోగా నికరంగా ఆయన చేసిన రుణమాఫీ కేవలం రూ. 3 వేల కోట్లు మాత్రమే. కానీ మేం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 21వేల కోట్లు రుణమాఫీ చేశాం. మేం రుణమాఫీ చేయలేదంటున్న కేసీఆర్ ఫాంహౌస్‌కు వచ్చినోళ్లకు చోద్యం చెప్పుడు కాదు.. అసెంబ్లీకి రా లెక్కలు చెబుతాం.. రైతుల జాబితాతో సహా మేం చేసిన రుణమాఫీ లెక్కలు చూపిస్తాం.. నీకు చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి రా.. నీలా ఇచ్చిన హామీలను ఎగ్గొట్టి పంగనామాలు పెట్టిన చరిత్ర నాది కాదు..ఆయన గంభీరంగా చూస్తున్నడట.. ఎవరిని చూస్తున్నావ్? అచ్చోసిన ఆబోతుల్లా కొడుకు, అల్లుడిని ఊరిమీదకు వదిలిండు. జహంగీర్ పీర్ దర్గాకు, వేములవాడ రాజన్నకు నిధులు ఇస్తానని మోసం చేసినవ్.. పాలమూరును ఎరవేసి ఎండబెట్టిన దుర్మార్గుడు కేసీఆర్.. మాప్రభుత్వంలో రైతులకు రుణమాఫీ జరిగింది, రైతు భరోసానూ ఇస్తున్నం.. మార్చి 31 లోగా రూ. 10 వేల కోట్లు రైతు భరోసా వేస్తాం.. భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి ఏడాదికి రూ. 12 వేలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తాం.. మొదటి ఏడాదిలోనే 55142 ఉద్యోగ నియామకాలు పూర్తి చేసిన ఘనత మా ప్రభుత్వానిది.. నీ నాయకత్వంపై నీకు నమ్మకం ఉంటే అసెంబ్లీకి రా.. కొడితే బలంగా కొట్టడం సంగతి పక్కకు పెడితే సరిగ్గా నిలబడటం నేర్చుకో.. ట్విట్టర్ లో ఈయనకు లైకులు ఎక్కువ వచ్చాయని చెప్పుకుంటుండు.. పదేళ్ల ముఖ్యమంత్రిగా చేసిన ఆయన సోషల్ మీడియాలో లైకులు వచ్చాయని చెప్పుకుంటుండు అంటే ఆయన మానసిక స్థితి ఎట్లుందో అర్థం చేసుకోండి.. కేసీఆర్ ముందు నీ కొడుకును, అల్లుడిని దారిలో పెట్టుకో.. బీసీ కులగణన, మాదిగ వర్గీకరణపై ఫిబ్రవరి మొదటి వారంలో అసెంబ్లీ పెడుతున్నాం.. పొంకనాలు కొట్టుడు కాదు.. దమ్ముంటే అసెంబ్లీకి రా మాట్లాడుకుందాం.. ఫాం హౌస్ లో ఉన్న కేసీఆర్ కు ప్రజలతో బంధం తెగిపోయింది.. కేసీఆర్ కాలం చెల్లిన వెయ్యి నోటు.. కేసీఆర్ మమ్మల్ని అభినందించడానికి నీకు మనసు రాకపోతే ఫామ్ హౌస్ లోనే పడుకో' అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## విద్యారంగంపై ప్రత్యేక దృష్టి



**రంగారెడ్డి, జనవరి 31:** గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని యూనివర్శిటీలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, బీఆర్ఎస్ హయాంలో యూనివర్శిటీలు పునరావాస కేంద్రాలుగా మారాయని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే యూనివర్శిటీల ప్రక్షాళన చేపట్టి, వీసీలను నియమించామని ఆయన గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లాలోని మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవాలలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొగిలిగిద్దలో నూతనంగా నిర్మించనున్న పాఠశాల భవనానికి సీఎం భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యపై ఖర్చు చేయడం అంటే... భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టడం అని చెప్పారు. విద్యాశాఖను తన దగ్గర పెట్టుకుని నిత్యం పర్యవేక్షిస్తు న్నానని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాస్మోటిక్, డైట్ చార్జీలను పెంచలేదని, మేం అధికారంలోకి రాగానే విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చార్జీలను పెంచామన్నారు. డైట్ 40శాతం, కాస్మోటిక్ ఛార్జీలు 200 శాతం పెంచామని తెలిపారు. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు పెంచడానికి 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' ఏర్పాటు చేస్తామని చెప్పారు. దేశంలో 140 కోట్ల జనాభా ఉన్నప్పటికీ ఒక్క గోల్డ్ మెడల్ రాలేదని, కానీ ఉత్తర కొరియా 30 గోల్డ్ మెడల్స్ సాధించిందని పేర్కొన్నారు. అందువల్ల, మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడానికి స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. క్రీడాకారులకు ఉద్యోగాలు, నగదు ప్రోత్సాహకాలు అందించబడతాయని చెప్పారు. మొగిలిగిద్ద పాఠశాల గత ప్రభుత్వ హయాంలో పట్టించుకోకపోవడాన్ని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. మొగిలిగిద్ద పాఠశాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. 16 కోట్లు కేటాయించి, కొత్త భవనం నిర్మాణం ప్రారంభించారన్నారు. మొగిలిగిద్దలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ స్థాపన చేస్తున్నట్లు ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో టీచర్ పోస్టుల భర్తీ జరగలేదని, మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 11 వేల ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని తెలిపారు. గతంలో నోటిఫికేషన్లు ఇచ్చినా, నియామక ప్రక్రియ సంవత్సరాల తరబడి జరుగుతున్నాయని విమర్శించారు. మేము 55 రోజుల్లోనే డీఎస్సీ నియామక ప్రక్రియను పూర్తి చేశామని చెప్పారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, ప్రొఫెసర్ హరగోపాల్, ఎమ్మెల్యే తదితరులు పాల్గొన్నారు.




## గోషామహల్‌లో ఉస్మానియా ఆస్పత్రి

### అట్టహాసంగా సిఎం రేవంత్ శంకుస్థాపన

**హైదరాబాద్,జనవరి 31:** గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణానికి ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి భూమిపూజ చేసారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి,ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్,ఎంఎల్ ఏ దానం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు. 26 ఎకరాల విస్తీర్ణంలో నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం జరుగనుంది. 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన ఆసుపత్రి...2 వేల పడకల సామర్థ్యం తో ఆస్పత్రి నిర్మాణం ..కార్పొరేట్ ఆసుపత్రిని తలదన్నేలా నిర్మాణం చేపడతారు.

## రాష్ట్రపతి ప్రసంగంపై సోనియా, రాహుల్ విమర్శలు

**న్యూఢిల్లీ, జనవరి 31:** రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్షాలు దాడిని షురూ చేశాయి. పార్లమెంటు ప్రాంగణంలో రాష్ట్రపతి ప్రసంగంపై గాంధీ కుటుంబం చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అయితే బడ్జెట్ సెషన్ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగం గురించి కాంగ్రెస్ ఎంపీ సోనియా గాంధీ మాట్లాడుతూ, ద్రౌపది ముర్ము చాలా అలసిపోయిందని.. పూర్ లేడీ అని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ ప్రెసిడెంట్ ప్రసంగం 'బోరింగ్' అని వ్యాఖ్యానించారు. అసలేం జరిగిందంటే.. రాష్ట్రపతి ప్రసంగం అనంతరం గాంధీ కుటుంబ సభ్యులు పార్లమెంట్ వెలుపలకు వచ్చారు. ఆ సమయంలో.. మీడియా వాళ్లు వారి స్పందనను తెలుసుకునే



ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో సోనియా తొలుత ప్రెసిడెంట్ ప్రసంగాన్ని ఫాల్స్ ప్రామిస్ అని అభివర్ణించారు. అప్పుడు పక్కనే ఉన్న రాహుల్ బోరింగ్ అని వ్యాఖ్యానించారు. ఆపై సోనియా గాంధీ బదులిస్తూ, 'చివరికి రాష్ట్రపతి చాలా అలసిపోయారు. ఆమె మాట్లాడలేకపోయింది. పూర్ థింగ్' అని అన్నారు. ఈ సమయంలో ప్రియాంక గాంధీ కూడా ఉన్నారు, కానీ ఆమె ఏమీ మాట్లాడలేదు. రాష్ట్రపతిపై ఈ కామెంట్స్ చేయడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఈ వ్యాఖ్య దేశంలోని మొదటి గిరిజన మహిళా రాష్ట్రపతిని అవమానించడమేనని పేర్కొంది. ఈ వ్యాఖ్య కాంగ్రెస్ నీచ రాజకీయ స్వభావాన్ని బహిర్గతం చేస్తుందని బీజేపీ సీనియర్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ అంశంపై కేంద్ర మంత్రి జేపీ నడ్డా తీవ్రంగా స్పందించారు. గౌరవనీయులైన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై సోనియా చేసిన కామెంట్స్‌ను తనతో పాటు ప్రతి బీజేపీ కార్యకర్త ఖండిస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి పదాలను ఉద్దేశపూర్వకంగా వాడటం ద్వారా కాంగ్రెస్ పార్టీ పేద, గిరిజన వ్యతిరేక వైఖరి స్పష్టమైందన్నారు. గౌరవనీయులైన రాష్ట్రపతికి, భారతదేశంలోని గిరిజన సంఘాలకు కాంగ్రెస్ పార్టీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని జేపీ నడ్డా డిమాండ్ చేశారు.

జనత
www.epaperjanathadaily.in
శనివారం 1 ఫిబ్రవరి 2025


# నేను కొడితే మామూలుగా ఉండదు

- గట్టిగా కొట్టడం తనకు అలవాటు
- కాంగ్రెస్ ఏడాది పాలనలోనే రాష్ట్రం దివాళా
- అప్పుడే కరెంట్ కోతలు..నీటి సమస్యలు
- జహీరాబాద్ బిఆర్ఎస్ నేతల భేటీలో కెసిఆర్ ఘాటు వ్యాఖ్యలు



**గజ్వేల్, జనవరి 31:** తాను కొడితే మామూలుగా ఉండదని.. గట్టిగా కొట్టడం తన అలవాటని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ అన్నారు. ఈ మేరకు ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌లో బిఆర్ఎస్ నేతల సమావేశంలో బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు కీలక వ్యాఖ్యలు చేశారు. జహీరాబాద్ బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలు సంతోషంగా లేరన్నారు. గంభీరంగా, మౌనంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్నానని అన్నారు. తాను ఎన్నో ప్రభుత్వాలను చూశానని.. ఇలాంటి ప్రభుత్వాన్ని మాత్రం చూడలేదన్నారు. ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని, కాంగ్రెస్ వాళ్లు కనబడితే జనాలు కొట్టేలా ఉన్నారన్నారు. తాను చెప్పినా ప్రజలు వినలేదని.. అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓటేశారన్నారు. రైతుబంధుకు రాం రాం.. దళితబంధుకు జై భీం చెబుతారని తాను ఎన్నికల సమయంలోనే చెప్పానని గుర్తు చేశారు. ఏ ప్రభుత్వం కావాలని కాంగ్రెస్ సోషల్ మీడియాలో ఓటింగ్ పెట్టారన్నారు. ఇప్పుడే మన ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వమే కావాలని ఓట్లు వేశారన్నారు. కాంగ్రెస్ పాలకులు రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారని ఆరోపించారు. గురుకులాల్లో చదువు అగమ్యగోచరమైందని.. పురుగుల అన్నం పెడుతున్నారని మండిపడ్డారు. తులం బంగారానికి ఆశపడి కాంగ్రెస్‌కు ఓటు వేశారన్నారు. రాబోయే రోజుల్లో విజయం మనదేనన్నారు. మన విజయం తెలంగాణ ప్రజల విజయం కావాలన్నారు. ప్రత్యక్ష పోరాటాలకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పోరాటం చేస్తే తప్ప ఈ ప్రభుత్వం దిగిరాదన్నారు. ఫిబ్రవరి నెలాఖరులో భారీ సభ పెడుతామని.. బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో భూముల ధరలు అమాంతం పడిపోయాయని.. రాష్ట్రంలో ప్రాజెక్టులు అక్కడే ఆగిపోయాయని మండిపడ్డారు. సంగమేశ్వర, బసవేశ్వర, కాళేశ్వరం ప్రాజెక్టులను ఎండబెడుతున్నారంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని మబ్బులు ఇప్పుడే తొలగిపోయి నిజాలు బయటకు వస్తున్నాయన్నారు. మంచేదో చెడు ఏదో ప్రజలకు తెలుస్తుందన్నారు. మాట్లాడితే ఫామ్ హౌస్.. ఫామ్ హౌస్ అని బద్నాం చేస్తున్నారన్న కేసీఆర్.. ఫామ్ హౌస్‌లో పంటలు తప్ప ఏముంటాయని ప్రశ్నించారు. ఓట్ల కోసం కాంగ్రెస్ ముస్లింలను వాడుకుంటుందన్నారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల టెండర్లు ఎందుకు పిలువలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనపై అంతా అసంతృప్తే ఉందన్నారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ ముంచిందన్నారు. పాలనా వైఫల్యాలను నిలదీస్తే కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రాజెక్టులకు సంబంధించి ఎలాంటి పురోగతి లేదని దుయ్యబట్టారు. 'రాష్ట్రాన్ని కైలాసంలో పెద్దపాము మింగినట్లైంది. తెలంగాణకు ఇదో మంచి గుణపాఠం. కొందరు అత్యాశకు పోయి చెప్పుడు మాటలు విని మోసపోయారు. రైతు భరోసా ఇస్తారో.. లేదో. ఇచ్చినా కూడా మోసమే.. ఎన్నికల కోసమే ఇస్తారు. రాష్ట్ర ఆదాయం భారీగా పడిపోయింది. భారాస హయాంలో ఆదాయం ఏటా పెరిగితే ఇప్పుడు పడిపోయింది. రూ.13 వేల కోట్ల ఆదాయం పడిపోయిందని కాగ్ నివేదిక స్పష్టం చేసింది. పరిస్థితులు ఇంకా దారుణంగా తయారవుతాయి. మరో నాలుగు నెలల గడిస్తే జీతాలు ఇవ్వలేని పరిస్థితి వస్తుంది. భూముల ధరలు బాగా పడిపోయాయి, రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతింది. గురుకులాల్లో పురుగుల అన్నం పెడుతున్నారని తల్లిదండ్రులు పిల్లల్ని తీసుకెళ్తున్నారు. మళ్లీ పాత కాంగ్రెస్ మోపైంది. విద్యుత్ కోతలు ఉన్నాయి, తాగునీరు సరిగా రావడం లేదు. సాగునీటి ప్రాజెక్టులను పండపెట్టారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల కోసం పోరాడదాం. ఇప్పుడే కరెంటు కోతలు ఉంటే.. ఏప్రిల్, మే లో ఎలా ఉంటుందో? రాజ్యం అంటే ఇలానే ఉంటుందా? ఏడాది పూర్తయింది.. ఎండగట్టాలని మన వాళ్లు అంటున్నారు. ఫిబ్రవరి నెలాఖరులో భారీ బహిరంగసభ పెట్టి ప్రభుత్వాన్ని ఎండగడదాం. నేను గంభీరంగా, మౌనంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్నాను. కొడితే మామూలుగా కాదు.. గట్టిగా కొట్టడం నాకున్న అలవాటు. నేను ఎన్నో ప్రభుత్వాలను చూశాను కానీ, ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. ఏడాదిలోనే ఇంత వ్యతిరేకత కాంగ్రెస్ ప్రభుత్వంపై వచ్చింది. కాంగ్రెస్ వాళ్లు కనిపిస్తే జనాలు కొట్టేలా ఉన్నారు. ఏ ప్రభుత్వం కావాలని కాంగ్రెస్ సోషల్ మీడియాలో ఓటింగ్ పెడితే.. భారాస ప్రభుత్వం కావాలని ఓట్లు వేశారు. తెలంగాణ శక్తి ఏమిటో చూపించి కాంగ్రెస్ మెడలు వంచుదాం. ఫాం హౌస్... ఫాం హౌస్ అని అంటారు. ఇక్కడ అల్లం, ఉల్లిపాయ తప్ప ఏమున్నాయి? కాంగ్రెస్ వాళ్లు ఇక్కడకు వస్తే తలో పార ఇచ్చి తవ్వుకోమందాం. కచ్చితంగా రాబోయేది మన ప్రభుత్వమే. అందులో అనుమానం ఏమీ లేదు' అని కేసీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో హరీస్ రావు, ఎమ్మెల్యేలు సునీతా మహేందర్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ హయాంలో పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక




**హైదరాబాద్, జనవరి 31:** బిఆర్ఎస్ హయాంలో పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో కెసిఆర్ ముందుకు సాగారని పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. ఆనాడు ప్రత్యేకంగా నిధులు విడుదల చేశామని అన్నారు. అందుకే ఆర్థిక ఇంజిన్లుగా ఉన్న పట్టణాలను, వాటిని సమగ్రంగా డెవలప్ చేయాలని అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. సమైక్య రాష్ట్రంలో మున్సిపాలిటీలు మురికి కూపాలుగా ఉండేవని.. బల్దియాలు అంటే ఖాయా.. పియా.. చల్దియా.. అనే సామెత ఉండేది కెటి రామారావు అన్నారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మున్సిపల్ చైర్‌పర్సన్ సన్మాన కార్యక్రమంలో కేటీఆర్, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక కేసీఆర్ పట్టణాల అభివృద్ధి కోసం ప్రత్యేక విజన్‌తో పని చేయాలని దిశా నిర్దేశం చేశారన్నారు. పట్టణీకరణ ఆపాలని కొన్ని దేశాలు చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయన్నారు. పట్టణాల విస్తరణ ఆపడం వీలు కాదు.. కానీ ప్రభుత్వాలకు వాటిని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి మాత్రం అవకాశం ఉంటుందన్నారు. అందుకే ఆ దిశగా పదేళ్లు పనిచేశామన్నారు. చేసిన పనిని అభివృద్ధి నివేదికల రూపంలో ప్రజల ముందుంచామన్నారు. దేళ్ల పాటు జరిగిన పట్టణాలు అభివృద్ధి కేవలం డైలాగులు కొడితే కాలేదన్నారు. పక్కా ప్రణాళికతో పాటు అవసరమైన సంస్కరణలు, నిరంతర పర్యవేక్షణ అవసరమైన నిధులు అందించడం తదితర నిరంతర ఫోకస్‌తోనే తెలంగాణలోని పట్టణాలు ఈరోజు మోడల్ పట్టణాలుగా తయారయ్యాయన్నారు. తెలంగాణ పట్టణాలకు పదేళ్లలో అనేక జాతీయ అవార్డులు దక్కాయన్నారు. గత పది సంవత్సరాలుగా మున్సిపల్ చైర్‌పర్సన్లు కౌన్సిలర్లుగా పట్టణాల అభివృద్ధి కోసం పని చేశారన్నారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి పూర్తి చేశారని చెప్పారు. పదవీ కాలం ముగిసిన చైర్మన్లు, కౌన్సిలర్లు ప్రజల్లోనే ఉండాలని.. మళ్లీ ఎన్నికలు వస్తే ప్రజలు గెలిపించుకుంటారన్నారు. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత పెద్ద ఎత్తున పరిపాలన వికేంద్రీకరణ కార్యక్రమాలు చేపట్టామన్నారు. కొత్త జిల్లాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు పరిపాలన మరింత దగ్గరైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధితో పట్టణాలతో పాటు ప్రజల ఆస్తుల విలువ కూడా పెరిగిందన్న కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పట్టణాలు అభివృద్ధి కుంటుపడడంతో పాటు ప్రజల ఆస్తుల విలువ కూడా భారీగా పడిపోయిందని అన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన కొత్తగా కట్టాల్సింది పోయి హైడ్రా, మూసి ప్రాజెక్టుల పేరుతో కూలగొడు తున్నారన్నారు. ప్రభుత్వాన్ని నడిపే వారి ఆలోచనలు సానుకూలంగా ఉంటే రాష్ట్రం, పట్టణాలు అభివృద్ధి చెందుతాయన్నారు. గతంలో నల్లగొండ పట్టణాన్ని సమూలంగా అభివృద్ధి చేసిన మనల్ని కాంగ్రెస్ మంత్రులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని.. కానీ అదే నల్లగొండ పట్టణంలో నాలుగు నెలలుగా సిబ్బందికి జీతాలు లేకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నల్లగొండ పర్యటన తర్వాత నన్ను బచ్చగాడు అంటున్న మంత్రి.. సీనియర్ అయ్యుండి పట్టణ అభివృద్ధిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. మోసపూరిత 420 హామిలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పాలన చేతకావడం లేదన్నారు. టకీ టకీ మని పైసలు పడుతాయన్నారని.. కానీ, టకీ టకీమని ఢిల్లీలో పైసలు పడుతున్నాయన్నారు. ఆరున్నర లక్షల కొత్త రేషన్ కార్డులను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చినప్పటికీ.. కాంగ్రెస్ పార్టీ రేషన్ కార్డులు ఇవ్వనేలేదంటూ అబద్దాలు చెబుతుందన్నారు. ఈ విషయం అప్పటి రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు కాంగ్రెస్ నాయకులను అడిగితే తెలుస్తుందన్నారు. డూప్లికేట్ గాంధీలకు తెలంగాణ ఇచ్చిన హామీలను అమలు చేసేలా బుద్ధి ఇవ్వాలని మహాత్ముడి విగ్రహాలకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు.

# నీళ్లమీద రేవంత్‌రెడ్డి నీచ రాజకీయం

- ప్రజలకు మేలు చేయాలి
- కేసీఆర్ పథకాలను కొనసాగించాలి
- ఎమ్మెల్సీ కవిత డిమాండ్



**హైదరాబాద్, జనవరి 31 :** నీళ్ళ మీద రేవంత్ రెడ్డి ప్రభుత్వం నీచ రాజకీయం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో "నీళ్లు - నిజాలు"పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. నీటి విషయాల్లో రాజకీయం చేయడం మానేసి నిజాలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ బురద రాజకీయానికి గోదావరి వరదను కూడా తట్టుకొని మేడిగడ్డ బ్యారేజీ మేరునగధీరుడిలా నిలబడిందన్నారు. కేసీఆర్ పూర్తి చేసిన ప్రధాన ప్రాజెక్టుల్లో మిగిలి ఉన్న చిన్న చిన్న పనులను ప్రభుత్వం పూర్తి చేయాలన్నారు. రాజకీయాలకు అతీయంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజనీతజ్ఞతను ప్రదర్శించాలన్నారు. వైఎస్ఆర్ ప్రారంభించిన ఆరోగ్య శ్రీని కేసీఆర్ కొనసాగించారని.. కాంగ్రెస్ ప్రారంభించిన ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ కొనసాగిస్తోందని గుర్తుచేశారు. అదే తరహాలో కేసీఆర్ ప్రారంభించిన పనులను సీఎం రేవంత్ రెడ్డి కొనసాగించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మిస్ గైడెడ్ మిస్సైల్‌లా పనిచేస్తున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. "కేసీఆర్ శత్రువు అని రేవంత్ రెడ్డి అనుకుంటున్నారని.. కానీ మన జలాలను తరలిస్తున్న ఆంధ్రా పాలకులు మన శత్రువులని ఆయన గమనించాలి. ఆంధ్ర కేడర్‌లో పనిచేసిన ఆదిత్యానాథ్ దాస్‌ను బాధ్యతల నుంచి తొలగించాలి. కృష్ణ ట్రైబ్యునల్‌లో రాష్ట్రం తరఫున బలంగా వాదనలు వినిపించాలి" అని అన్నారు. జలవనరుల విషయాల్లో ఇతర రాష్ట్రాల్లో పార్టీలకు అతీతంగా ఒక్కటవుతారని.. కానీ తెలంగాణ మాత్రం కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రాజకీయం చేస్తున్నాయని ఆరోపించారు. కేసీఆర్ నిర్మించిన ప్రాజెక్టులు పనికిరావని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. నీళ్లు ఇవ్వక రైతుల పొట్టకొడుతున్నారని విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా, ఇరిగేషన్ శాఖ మంత్రి సొంత జిల్లాలో పంటను ఎండగొట్టారన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే సీతారామ ఎత్తిపోతల పథకం పనులు దాదాపు పూర్తి అయ్యిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని ఆర్భాటంగా ప్రారంభించినా ఆ ప్రాజెక్టు ద్వారా చుక్క నీరు కూడా ఇవ్వలేదని ఎమ్మెల్సీ కవిత విమర్శలు గుప్పించారు.

# గద్దర్ పోరాటం చిరస్మరణీయం

- గద్దర్‌ను విమర్శిస్తే.. వారుండే ప్రాంతానికి ఆ పేరే పెడతాం
- గద్దర్‌ను ప్రగతిభవన్‌కు రానీయని వారు ..ఇప్పుడు బయట ఉన్నారు
- గద్దర్ జయంతి వేడుకల్లో సిఎం రేవంత్ ఉద్వేగపూరిత ప్రసంగం



హైదరాబాద్, జనవరి 31: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేసిన గద్దర్ పేరిట అవార్డు ఇవ్వాలని నిర్ణయించుకున్నామని.. ఆయన పేరిట అవార్డు ఇవ్వడమంటే ప్రతియేటా ఆయనను స్మరించు కోవడమేనని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. సమాజానికి స్ఫూర్తినిచ్చేలా గద్దర్ అవార్డు ఉండాలని భావించానని.. అందుకే గద్దర్ అవార్డుల బాధ్యతను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అప్పగించానని తెలిపారు. గద్దరన్న మరణించినప్పుడు ఆయన చివరిచూపు ప్రజలందరికీ దక్కాలని ఎల్బీ స్టేడియానికి తీసుకొచ్చామని.. కానీ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్టేడియం గేట్లకు తాళం వేసిందని ÷ర్ అయ్యారు. గద్దర్ చివరి శ్వాస వరకు తాను నమ్మిన సిద్ధాంతాల కోసం జీవించారని కొనియాడారు. గద్దర్ 77వ జయంతిక ఆర్యక్రమం రవీంద్రభారతిలో నిర్వహించారు. భాషా సాంస్కృతిక శాఖ, గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జయంతి వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాజకీయంగా ఒంటరిననే భావన వచ్చినప్పుడల్లా గద్దర్ దగ్గరకు వెళ్లి సలహాలు తీసుకునే వాడిని. నీ బాధ్యత నెరవేర్చు ప్రజలు తప్పకుండా నిన్ను గుర్తించి అవకాశం ఇస్తారని చెప్పేవారు. వారి మాట నిజమైంది' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన గద్దర్ జయంతి కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ... గద్దర్ ఆఖరి శ్వాస వరకు తాను నమ్మిన సిద్ధాంతాల కోసం జీవించారని కొనియాడారు. గద్దర్ చెప్పినట్లే నా బాధ్యత నెరవేర్చాను.. ప్రజలు నాకు అవకాశం ఇచ్చారని అన్నారు. ఈ ఏడాది రాష్ట్రం నుంచి ఐదుగురికి పద్మ అవార్డులు ఇవ్వాలని కేంద్రానికి సిఫార్సు చేశాం. గద్దర్, గోరటి వెంకన్న, చుక్కా రామయ్య, అందెశ్రీ, జయధీర తిరుమలరావుకి పద్మ అవార్డులు ఇవ్వాలని ప్రతిపాదించామని తెలిపారు. కానీ పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ నుంచి ఐదుగురి పద్మ అవార్డులు ఇచ్చారు.. వాళ్ల కంటే మేం ప్రతిపాదించిన వాళ్లు తక్కువా అని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. కేంద్ర చేసిన తప్పును సరిదిద్దుకుంటుందని లేఖ కూడా రాశా.. కానీ వాళ్లు తప్పు సరిదిద్దుకోకుండా గద్దర్‌కు అవార్డ్ ఇవ్వమని అన్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇంకోసారి గద్దర్ గురించి తప్పు మాట్లాడితే.. సంబంధిత పార్టీ కార్యాలయం పరోక్షంగా బీజేపీఉండే ప్రాంతానికి గద్దర్ పేరు పెడతామని సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలోనూ కొందరు నేతలు గద్దర్ ను ప్రజా భవన్ బయట నిలబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గద్దర్ ను ప్రజా భవన్ బయట నిలబెట్టిన వ్యక్తులు.. ఇప్పుడు ప్రజా భవన్ బయట ఉన్నారని అన్నారు. గద్దర్ గురించి తప్పుగా మాట్లాడిన వ్యక్తికి ఓట్ల విప్లవం చూపిస్తామని హెచ్చరించారు. రాహుల్ గాంధీతో మాట్లాడి గద్దర్‌కు మేమే అవార్డు ఇప్పిస్తామన్నారు. అవార్డులు ఇచ్చేది మేమే అని భాజపా నేతలు అంటున్నారు. వారి పార్టీ కార్యాలయం తెలంగాణలో ఉంది. ఇంకోసారి గద్దర్ గురించి తప్పుగా మాట్లాడితే భాజపా ఆఫీసు ఉన్న ప్రాంతానికి, కాలనీకి గద్దరన్న పేరు పెడతాం. ప్రతి దానికీ మా దగ్గర మందు ఉంది. గతంలో గద్దర్‌ను అవమానించిన వారికి తగిన శాస్తి జరిగింది. గద్దరన్నపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం' అని

రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. మరణం తరవాత గద్దర్ భౌతిక కాయాన్ని తీసుకెళ్తే.. గత కేసీఆర్ ప్రభుత్వం ఎల్బీ స్టేడియానికి తాళం వేసిందని మండిపడ్డారు. గద్దరన్న చివరిచూపు ప్రజలందరికీ దక్కాలని ఎల్బీ స్టేడియానికి తీసుకొచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గద్దర్ చివరి శ్వాస వరకూ తాను నమ్మిన సిద్ధాంతాల కోసం జీవించారని అన్నారు. తెలుగు సినీ రంగానికి.. గద్దర్ పేరుతో తెలంగాణ ఫిలిం అవార్డులు ఇవ్వబోతున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఉగాది సందర్భంగా గద్దర్ తెలంగాణ ఫిలిం అవార్డులు ఇవ్వబోతున్నామని ప్రకటించారు. గద్దర్‌కు కులం, మతం లేదు.. ఆయన విశ్వ మానవుడని అభివర్ణించారు. గద్దర్ తెలంగాణలో పుట్టడం మన అదృష్టమని ఉద్ఘాటించారు. గద్దర్ జయంతి, వర్ధంతిని అధికారికంగా చేస్తారని ఎవరూ ఊహించి ఉండరని చెప్పారు. గద్దర్ జయంతి, వర్ధంతిని అధికారికంగా చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారని అన్నారు. పాట, మాటతో లక్షలాదిమందిని ప్రభావితం చేశారని చెప్పుకొచ్చారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం గద్దర్ ప్రత్యేక పాట రాశారని గుర్తుచేశారు. గద్దర్ పాట తెలంగాణ ప్రజలను కదిలించిందని చెప్పారు. ఐదుగురికి పద్మ అవార్డులు ఇవ్వాలని కేంద్రానికి ప్రతిపాదన చేశామని చెప్పారు. గద్దర్, గోరటి వెంకన్న తదితరులకు ఇవ్వాలని లేఖ రాశామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు.





# ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆసక్తికర మలుపు

## అప్రకటిత నేరస్థులుగా ప్రభాకర్ రావు, శ్రవణ్ రావు

## న్యాయస్థానంను ఆశ్రయించే అవకాశం?





**హైదరాబాద్,జనవరి 31 :** సంచలనం రేపుతున్న ఫోన్ల అక్రమ ట్యాపింగ్ కేసు దర్యాప్తు ఆసక్తికర మలుపులు తిరుగుతోంది. తప్పించుకు తిరుగుతున్న నిందితులపై ఒత్తిడి పెం చేందుకు పోలీసులు మరో ప్రయత్నం ప్రారంభించారు. ప్రొక్లెయిమ్డ్ అఫెండర్ అంటే ప్రకటిత నేరస్థుడు అస్త్రాన్ని ప్రయోగించే దిశగా కార్యాచరణను ఆరంభించారు. న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. దర్యాప్తును ముందుకు సాగనీయకుండా తప్పించుకు తిరుగుతున్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావుతోపాటు మరో కీలక నిందితుడు శ్రవణ్‌రావును ప్రకటిత నేరస్థులుగా నిర్ధారించే దిశగా కసరత్తు చేపట్టారు. గతేడాది మార్చి 10న పంజాగుట్ట ఠాణాలో కేసు నమోదైన వెంటనే విదేశాలకు పారిపోయిన వారిద్దరు విచారణను ఎదుర్కోకుండా తప్పించుకు తిరుగుతున్నారు. వారిపై రెడ్‌కార్నర్ నోటీస్ జారీ చేయించే దిశగా పోలీసులు ప్రారంభించిన ప్రక్రియను అడ్డుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. తమ పాస్‌పోర్టులను రద్దు చేయొద్దంటూ విదేశీ వ్యవహారాల శాఖ వద్ద దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. దర్యాప్తు ముందుకు సాగాలన్నా.. ఈ దందా లో రాజకీయ నేతల ప్రమేయంపై ఆధారాలు బహిర్గతం కావాలన్నా వారిని విచారించాల్సిన అవసరమేర్పడిందని పోలీసులు పేర్కొంటున్నారు. వారిని ఎప్పటిలోగా అరెస్ట్ చేస్తారంటూ న్యాయస్థానం ప్రశ్నించిన నేపథ్యంలో అందుబాటులో ఉన్న అన్ని మార్గాలపై పోలీసులు దృష్టి సారించారు. విచారణకు హాజరుకాకుండా తప్పించుకుంటున్న ఎవరినైనా ప్రొక్లెయిమ్డ్ అఫెండర్లుగా గుర్తించేందుకు పోలీసులు ముందుగా న్యాయస్థానం అనుమతి పొందాలి. పోలీసులది సరైన చర్యగా న్యాయస్థానం భావిస్తే తొలుత ఒక ఉత్తర్వు జారీ చేస్తుంది. దాని ప్రతులను నిందితుడి నివాసప్రాంతంతోపాటు బహిరంగ ప్రదేశాల్లో అతికిస్తారు. కొన్ని సందర్భాల్లో దినపత్రికల్లోనూ ప్రకటన ఇస్తారు. ఆ ఉత్తర్వు వెలువరించిన 30 రోజుల్లోగా నిందితుడు న్యాయస్థానం ఎదుట హాజరు కావాలి. రాకపోతే అప్పుడు ఆ నిందితుడిని ప్రొ÷-లకెయిమ్డ్ అఫెండర్‌గా న్యాయస్థానం గుర్తిస్తుంది. అలాంటి వారిని సాధారణ పౌరులెవరైనా సరే పట్టుకొచ్చి పోలీసులకు అప్పగించొచ్చు. అలాంటి నిందితుల ఆస్తుల్ని బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 85 కింద పోలీసులు జప్తు చేసే అవకాశముంటుంది.

# కుంభమేళాకు పోటెత్తుతున్న భక్తులు

## రద్దీ దృష్ట్యాఘాట్‌ల వద్ద గంగా హారతి రద్దు

## వారణాసిలోనూ గంగా హారతి తాతత్కాలికంగా నిలిపివేత

**వారణాసి,జనవరి31:** ప్రయాగ్‌రాజ్‌లో వైభవంగా జరుగుతున్న మహా కుంభమేళాకు భక్తులు భారీగా పోటెత్తుతున్నారు. కోట్లాదిగా తరలివస్తుండటంతో నెలకొన్న రద్దీ దృష్ట్యా కొన్ని రోజుల పాటు ఘాట్‌ల వద్ద గంగా హారతి కార్యక్రమాన్ని నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జనం రద్దీని దృష్టిలో ఉంచుకుని ఫిబ్రవరి 5 వరకు వారణాసిలోని దశాశ్వమేధ్, శీత్ల, అస్సీ మొదలైన ఘాట్‌లలో నిర్వహించే గంగా హారతిని నిలివేస్తున్నామని.. స్థానిక ప్రజలు అవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని పోలీస్ కమిషనర్ మోహిత్ అగర్వాల్ విజ్ఞప్తి చేశారు. ఘాట్‌ల వద్ద ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రయాగ్‌రాజ్‌కు వచ్చిన భక్తులు వారణాసికి పెద్ద సంఖ్యలో వస్తుండడంతో కొందరు ప్రయాణికులు వారణాసి, బనారస్ రైల్వే స్టేషన్‌లలో చిక్కుకుపోయినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ఎటువంటి ఘటనలు జరగకుండా భద్రతా బలగాలు నిరంతరం గస్తీ తిరుగుతున్నాయని తెలిపారు. మౌని అమావాస్య నుంచి కాశీలో భక్తుల రద్దీ పెరిగిందని.. వారి సంఖ్య తగ్గేవరకు ఇతరులు ఎవరూ వారణాసికి రావద్దని విజ్ఞప్తి చేశారు. మహా కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 30 మంది ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటన నేపథ్యంలో ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం రద్దీ నియంత్రణకు పలు కీలక నిర్ణయాలు తీసుకొంది. ఈ క్రమంలోనే కుంభమేళా ప్రాంతంలోకి వాహనాల రాకపోకలను నిషేధించారు. వీవీఐపీ, స్పెషల్ పాసులను రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రయాగ్‌రాజ్ పొరుగున ఉన్న జిల్లాల నుంచి వచ్చే వాహనాలను సరిహద్దుల వద్దే నిలిపివేయనున్నారు. భక్తుల సౌకర్యార్థం వన్ వే ట్రాఫిక్ వ్యవస్థను అమల్లోకి తెచ్చారు. ఇప్పటివరకు 29.64 కోట్లమంది భక్తులు కుంభమేళాకు వచ్చినట్లు అంచనా వేస్తున్నారు.



# ప్రపంచంలో మూడో ఆర్థికశక్తిగా భారత్

- సామాజిక, ఆర్థిక, రాజకీయ సుస్థిరతతో ఆదర్శం
- వికసిత భారత్ నిర్మాణమే లక్ష్యం
- మూడో టర్మ్‌లో .. మూడురెట్ల వేగంతో అభివృద్ధి
- బడ్జెట్‌లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం
- స్వయంసమృద్ధి, స్వావలంబన దిశగా దేశం పురోగతి
- పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము



**న్యూఢిల్లీ, జనవరి 31:** సామాజిక, ఆర్థిక, రాజకీయ సుస్థిరతలో ఈ ప్రపంచానికి భారత్ ఆదర్శంగా నిలిచిందని, మన ముందున్న ఏకైక లక్ష్యం.. 'వికసిత్ భారత్' నిర్మాణమే..అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ప్రపంచంలోనే భారత్‌ను మూడో ఆర్థిక శక్తిగా నిలపనున్నట్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. దేశాభివృద్ధి ఫలాలు అందరికీ అందాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగించారు. భారత సామాజిక చేతనకు మహాకుంభమేళా నిదర్శంగా నిలుస్తోందన్నారు. దేశాభివృద్ధి కోసం వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తమ ప్రభుత్వ మూడో టర్మ్‌లో మూడు రెట్ల వేగంతో అభివృద్ధి సాగుతోందని రాష్ట్రపతి తెలిపారు. ఆరంభంలో ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. ఇటీవలే తుదిశ్వాస విడిచిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. 'మహా కుంభమేళా జరుగుతున్న సమయంలో పార్లమెంట్ సమావేశాలు ప్రారంభించుకుంటున్నాం. ఇటీవల గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నాం' అని రాష్ట్రపతి హర్షం వ్యక్తంచేశారు. బడ్జెట్‌లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం ఉంటుందని ఆమె తెలిపారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే సర్కారు.. గత ప్రభుత్వాల పాలనతో పోలిస్తే మూడు రెట్లు వేగంతో పనిచేస్తోంది. త్వరలో ప్రపంచంలో మూడో ఆర్థికవ్యవస్థగా భారత్ మారనుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పేదరిక నిర్మూలన కోసం అనేక పథకాలు అమలుచేస్తున్నాం. 25 కోట్ల మందిని దారిద్ర్యం నుంచి బయటకు తీసుకొచ్చాం. అర్హులందరికీ లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలను వేగంగా అమలుచేస్తున్నాం అని అన్నారు. మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం. అదనంగా మూడు కోట్ల కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజనను పొడిగించాం అన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద.. 70 ఏళ్లు పైబడిన ఆరు కోట్ల మంది వృద్ధులకు ఆరోగ్య బీమా అందిస్తోంది. అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు ప్రవేశపెడుతున్నాం. విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. యువతకు నూతన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. నూతన విద్యా విధానంతో ఆధునిక విద్యా వ్యవస్థను ఏర్పాటుచేశాం. సంస్కరణలు వేగవంతం చేశాం. ఒకే దేశం-ఒకే ఎన్నిక, వక్ఫ్ సవరణ బిల్లు అమలు దిశగా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నాం అని అన్నారు. దేశంలో కార్పొరేట్ సంస్థలకు మహిళలు నాయకత్వం వహిస్తున్నారు. ఒలింపిక్ పతకాలు సాధిస్తూ దేశం గర్వించేలా చేస్తున్నారు. వారి సాధికారకతకు కృషి చేస్తున్నాం. మారుమూల ప్రాంతాల్లో డిజిటల్ సేవల కల్పనలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు గొప్ప ముందడుగు. నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ కింద 91 లక్షలకు పైగా స్వయం సహాయక బృందాలకు సాధికారికత కల్పిస్తున్నాం. 3 కోట్ల మందిని లక్‌పతీ దీదీగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం అన్నారు. భారత్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్‌హౌస్‌గా మార్చడమే మా లక్ష్యం. నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను ప్రారంభించాం. కృత్రిమ మేధ రంగంలో 'భారత ఏఐ మిషన్'ను మొదలుపెట్టాం. భారత్ తన సొంత మానవ సహిత అంతరిక్ష ప్రయోగం గగన్‌యాన్‌ను ప్రయోగించే రోజు ఎంతో దూరంలో లేదు. ఎంఎస్ఎంఈలకు క్రెడిట్ గ్యారెంటీ పథకాలు, ఇ-కామర్స్ ఎగుమతి కేంద్రాలు దేశంలో అన్ని రంగాల్లో వ్యాపారాలను ప్రోత్సహిస్తున్నాయి. సైబర్ సెక్యూరిటీలో సమర్థత కోసం నిరంతరం కృషి చేస్తున్నాం. డిజిటల్ మోసాలు, సైబర్ నేరాలు, డీప్‌ఫేక్ వంటివి సామాజిక, ఆర్థిక, దేశ భద్రతకు పెను సవాళ్లుగా మారాయి. ప్రపంచ వేదికపై డిజిటల్ టెక్నాలజీలో భారత్ కీలకపాత్ర పోషిస్తోంది. మన యూపీఐ లావాదేవీల వ్యవస్థ విజయాన్ని అభివృద్ధి చెందిన దేశాలు కూడా ప్రశంసించాయి. భారత మెట్రో నెట్‌వర్క్ 1000 కిలోమీటర్ల మైలురాయిని దాటింది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్‌గా నిలిచింది. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం దేశవ్యాప్తంగా 1.75లక్షల ఆరోగ్య మందిర్‌లను ఏర్పాటుచేశాం. క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల కోసం వారు ఉపయోగించే పలు ఔషధాలపై కస్టమ్ సుంకాన్ని రద్దు చేశాం. గర్భిణులు, పిల్లల వ్యాక్సినేషన్ కోసం యు-విన్ పోర్టల్‌ను ప్రారంభించాం. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు సాగు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందిస్తున్నాం. కచ్చితమైన వాతావరణ సమాచారాన్ని అందించేందుకు రూ.2000 కోట్లతో 'మిషన్ మౌసం'ను ప్రారంభించాం. సహకార రంగంలో అనేక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం అని వివరించారు. ఆర్టికల్ 370 తర్వాత జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు మెరుగయ్యాయి. సంస్కరణలు, పనితీరు, పరివర్తన అనేవి ప్రభుత్వ పాలనకు బలమైన స్తంభాలుగా మారాయన్నారు. సరిహద్దుల రక్షణ, అంతర్గత భద్రత కోసం ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. వామపక్ష అతివాదానికి వ్యతిరేకంగా పోరాటం చివరిదశకు చేరింది. నక్సల్స్ ప్రభావిత జిల్లాల సంఖ్య 38కు తగ్గింది. రక్షణ రంగంలో స్వావలంబన దిశగా కీలక అడుగులు వేస్తున్నాం అని రాష్ట్రపతి అన్నారు. బడ్జెట్ 2025లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. రూ.70 వేల కోట్లతో గ్రామీణ రహదారులను అభివృద్ధి చేస్తున్నాం. దేశాభివృద్ధి ఫలాలు అందరికీ అందాలన్నదే మా లక్ష్యం. పేద, మధ్యతరగతి ప్రజలకు హోమ్ లోన్ సబ్సిడీ ఇస్తున్నాం. ఉద్యోగుల కోసం 8వ వేతన సంఘాన్ని నియమించాం. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చాం. వన్ నేషన్ ? వన్ ఎలక్షన్ దిశగా అడుగులు వేస్తున్నాం. ట్యాక్స్ విధానాలను సరళీకరించాం. భారత్ త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లతో గొప్ప ముందడుగు వేస్తున్నాం. 70 ఏళ్లు దాటిన 6 కోట్లమందికి ఆరోగ్య బీమా కల్పిస్తున్నాం. యువతకు ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాం. దేశంలో లక్షా 15 వేల మంది మహిళలు లక్‌పతీ దీదీలుగా మారారు. మూడు లక్షలమంది మహిళలను లక్‌పతీ దీదీగా మార్చాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం' అని రాష్ట్రపతిముర్ము తన ప్రసంగంలో వివరించారు. రాజ్యాంగం ముందునాటి చట్టాలను సమీక్షిస్తున్నాం..ప్రస్తుత కాలానికి తగినట్లు ఆ చట్టాలను మారుస్తున్నాం. అటల్ టన్నెల్, సోన్‌మార్గ్ టన్నెల్ వంటివి నిర్మించాం. భారత మెట్రో నెట్‌వర్క్ 1000 కిలోమీటర్ల మైలురాయిని దాటింది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్‌గా నిలిచింది భావితరాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకుంటున్నాం. చ్చితమైన వాతావరణ సమాచారాన్ని అందించేందుకు రూ.2000 కోట్లతో మిషన్ మౌసంను ప్రారంభించాం అని వివరించారు. ఆమె ప్రసంగిస్తున్నంత సేపు ప్రధాని మోడీ సహా అధికారపక్ష సభ్యులు బల్లలు చరిచారు. అంతకుముందు రాష్ట్రపతి సంప్రదాయ పద్ధతిలో పార్లమెంట్‌కు చేరుకోగానే ఉప రాష్ట్రపతి ధన్‌కడ్, స్పీకర్ ఓంబిర్లాలు స్వాగతం పలికారు.

# దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా బడ్జెట్

- సమావేశాలకు ప్రతిపక్షాలు సహకరించాలి
- మీడియాతో ప్రధాని మోడీ ఆకాంక్ష



**న్యూఢిల్లీ, జనవరి 31:** పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టబోయే బడ్జెట్ దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఉంటుందని ప్రధాని మోడీ అన్నారు. పార్లమెంటు సమావేశాలు ప్రారంభం అయిన సందర్భంగా ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. ఈ సమావేశాలు ప్రారంభమయ్యే ముందు పార్లమెంటు వెలుపల ప్రధాని మోడీ మీడియాతో మాట్లాడారు. 'పార్లమెంటు సమావేశాలు సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సహకరిస్తాయని నేను భావిస్తున్నాను. మూడోసారి ఎన్డీయేకు ప్రజలు పట్టం కట్టారు. పార్లమెంటులో సంపూర్ణ బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నాం. ఈ బడ్జెట్ ప్రజల్లో కొత్త విశ్వాసం నింపుతుందని ఆశిస్తున్నాను. ఈ బడ్జెట్ వికసిత్ భారత్‌కు ఊతం ఇస్తుంది. ఇన్నోవేషన్, ఇన్‌క్లూజన్, ఇన్వెస్ట్‌మెంట్ లక్ష్యంతో దూసుకెళ్తున్నట్లు' మోడీ చెప్పారు. కొత్త విధానాలైనే ఆర్థిక ప్రగతి ఆధారపడి ఉంటుంది. ఈ సమావేశాల్లో కీలక బిల్లులను ప్రవేశపెట్టనున్నట్లు మోడీ తెలిప్పారు. ఇప్పుడు జరిగే పార్లమెంటు సమావేశాల్లో అన్ని అంశాలపై సమగ్ర చర్చ జరిపేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని మోడీ విజ్ఞప్తి చేశారు. జనవరి 31 నుండి ఏప్రిల్ 4 వరకు రెండు విడతల్లో బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. మొదటి విడత సమావేశాలు ఫిబ్రవరి 13న ముగుస్తాయి. ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం 16 బిల్లులను ప్రవేశపెట్టాలని చూస్తోంది. వీటిల్లో వక్ఫ్ (సవరణ) బిల్లు, బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లు, రైల్వే (సవరణ) బిల్లు, విపత్తు నిర్వహణ (సవరణ) బిల్లుతోపాటు పలు బిల్లులను ప్రభుత్వం పెట్టనుంది. బడ్జెట్ ప్రజల్లో కొత్త విశ్వాసం నింపుతుందని భరోసా ఇచ్చారు. అలాగే పదేళ్ల కాలంలో పార్లమెంట్ సెషన్‌కు ముందు ఈసారే విదేశీ జోక్యం కనిపించలేదని విపక్షాలకు చురకలు అంటించారు. 'పేదలు, సామాన్యులపై మహాలక్ష్మి కృప ఎప్పటికీ ఉండాలి. భారత శక్తిసామర్థ్యాలు మనకు విశేష గుర్తింపును ఇస్తాయి. మూడోసారి ఎన్డీయేకు ప్రజలు పట్టం కట్టారు. మూడోసారి పార్లమెంట్‌లో సంపూర్ణ బ్జడెట్ ప్రవేశపెడుతున్నాం. ఈ వార్షిక పద్దు ప్రజల్లో కొత్త విశ్వాసం నింపుతుంది. భారత్ అభివృద్ధి లక్ష్యంతో మిషన్ మోడ్‌లో ముందుకెళ్తున్నాం. ఇన్నోవేషన్,

ఇన్‌క్లూజన్, ఇన్వెస్ట్‌మెంట్ లక్ష్యంతో దూసుకెళ్తున్నాం. కొత్త విధానాల పైనే ఆర్థిక ప్రగతి ఆధారపడి ఉంటుంది. పార్లమెంటులో చరిత్రాత్మక బిల్లులు ప్రవేశపెడుతున్నాం. పార్లమెంటు సమావేశాల్లో అన్ని అంశాలపై సమగ్ర చర్చ జరుగుతుందని, ఉభయ సభలు సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సహకరిస్తాయని భావిస్తున్నాను' అని మోడీ ఆశాభావం వ్యక్తంచేశారు.

# త్వరలోనే మోడీ అమెరికా పర్యటన

## పరిశీలనలో ఉందన్న విదేశాంగ శాఖ



**న్యూఢిల్లీ,జనవరి 31 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికాలో పర్యటించే అవకాశంపై కేంద్ర విదేశాంగ శాఖ స్పష్టత ఇచ్చింది. కొద్దిరోజుల క్రితమే ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ ఫోనులో సంభాషించుకున్నారని, సాధ్యమైనంత త్వరగా మోదీ అమెరికాలో పర్యటించేందుకు ఇరుదేశాల అధికారులు కసరత్తు చేస్తున్నారని విదేశాంగశాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ చెప్పారు. ఇండో-అమెరికా సంబంధాలు మరింత బలోపేతం చేసే దిశగా మోదీ పర్యటన ఉంటుందని, ఏ తేదీల్లో అమెరికా వెళ్తారనేది త్వరలోనే తెలియజేస్తామని వివరించారు. 26/11 ముంబై పేలుళ్ల నిందితుడు తహవూర్ రాణాను ఇండియాకు రప్పించే విషయమై జైశ్వాల్ మాట్లాడుతూ, నిందితుడి పిటిషన్‌ను అమెరికా సుప్రీంకోర్టు కొట్టేసిందని, దీంతో సాధ్యమైనంత త్వరగా అతన్ని భారతదేశానికి అప్పగించేందుకు అవసరమైన విధివిధానాలపై అమెరికాతో సంప్రదింపులు సాగిస్తున్నామని చెప్పారు. అక్రమ వలసలపై ఇండియా వైఖరి చాలా స్పష్టంగా ఉందని, వీటిని ఎట్టపరిస్థితుల్లోనూ అంగీకరించరాదన్నదే భారత్ వైఖరి అని తెలిపారు. మైగ్రేషన్, మొబిలిటీపై ఇండియా-యూఎస్ మధ్య పరస్పర సహకారం ఉందన్నారు. అక్రమ వలసల నిరోధానికి అవసరమైన ప్రక్రియతో ముందుకు వెళ్తామని చెప్పారు.

## లక్ష్మీ నరసింహా స్వామి నీ దర్శించుకున్న జిల్లా న్యాయమూర్తి

**ఘన స్వాగతం పలికిన ఆలయ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్.**

**ఆలయ అభివృద్ధికి వ్యక్తిగతంగా కృషి చేస్తానని హామీ ఇచ్చిన జిల్లా జడ్జి.**



జనత న్యూస్ బెజ్జంకి : బెజ్జంకి మండల కేంద్రంలో గుట్టపై కొలువుదీరిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని సిద్దిపేట జిల్లా కోర్ట్ న్యాయమూర్తి సాయి రమాదేవి శుక్రవారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్ ఆలయ ప్రధాన అర్చకులు మధుసూదనా చార్యులు పూర్ణకుంభ స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ కమిటీ సభ్యుల తో కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ, లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని దర్శించుకోవడం, పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని, ఆలయ అభివృద్ధికి తన వంతుగా భక్తురాలిగా కృషి చేస్తానని చెప్పారు. అలాగే తన స్నేహితురాలైన దేవాలయ రాష్ట్ర అసిస్టెంట్ కమిషనర్ జ్యోతి తో వ్యక్తిగతంగా ఫోన్లో మాట్లాడి, ఆలయాన్ని ఒక్కసారి సందర్శించి , ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం తరఫున సహకరించాలని కోరిన జిల్లా న్యాయమూర్తికి ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి కుటుంబ సభ్యురాలు కరుణ శ్రీ, బెజ్జంకి మాజీ సర్పంచ్ రావుల నరసయ్య, ఆలయ కమిటీ సభ్యులు గుబిరె చంద్రం, బర్ల రాజయ్య, ఐలేని శ్రీనివాస్ రెడ్డి, బెజిగం విశ్వప్రసాద్, న్యాయవాది లింగాల శ్రీనివాస్, రోడ్డ మల్లేశం, బోనగం రమేష్ గౌడ్, రాజయ్య, ఏఎస్ఐ శంకర్రావు, ఆలయ సిబ్బంది శేషం సునీత, ప్రవీణ్, కనుకయ్య, ఎల్లయ్య, మహేష్ తదితల్లి పాల్గొన్నారు.

## ఉద్యోగాలు సాధించేలా కృషి చేయాలి

**కళాశాలలో అన్ని వస్తువులు కల్పిస్తాం**

**శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ రమేష్ రెడ్డి**



**తిమ్మాపూర్ జనతా న్యూస్ :** వృత్తి విద్యా కోర్సులను పూర్తిచేసే వరకు విద్యార్థులు తప్పకుండా ఉద్యోగాలను సాధించేలా కృషి చేయాలని శ్రీ చైతన్య ఇంజనీరింగ్, ఫార్మసి కళాశాలలో చైర్మన్ ముదసాని రమేష్ రెడ్డి తెలిపారు. మొదటి సంవత్సరం ఫార్మసీ విద్యార్థులకు ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తమ కళాశాలలో విద్యార్థులకు ఉన్నత విద్యాబోధన అందించేందుకు, అన్ని వసతులను, మెరుగైన సౌకర్యాలను కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా ఉద్యోగ సాధనే లక్ష్యంగా కష్టపడి చదవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులు తమ తల్లిదండ్రుల శ్రమకు తగిన ఫలితాన్ని అందించాలని, ఉద్యోగాలు సాధించినప్పుడే లక్ష్యాలను అందిపుచ్చుకున్న వారు అవుతారని సూచించారు. విద్యతో పాటు క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాలు సైతం ముఖ్యమైనవని తెలిపారు. ప్రతి విద్యార్థి తప్పకుండా క్యాంపస్ రిక్రూట్మెంట్ ద్వారా ఉద్యోగ అవకాశాలు సాధించేందుకే ప్రాధాన్యతను ఇవ్వాలని, తమ కళాశాలలో ప్రతి విద్యార్థి ఉద్యోగాలు సాధించడమే తమ లక్ష్యం అన్నారు. ఆ దిశగా తాము అనేక కంపెనీలను ప్లేస్మెంట్స్ నిమిత్తము కళాశాలకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. సీనియర్లు జూనియర్లకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. కళాశాలలో తరగతుల వారీగా గత విద్యా సంవత్సరంలో ప్రాధాన్యత కనబరిచిన విద్యార్థులకు, క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు పథకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రామ్ నర్సింహారెడ్డి, హెచ్ ఓ డి రవీందర్ రెడ్డి, సీనియర్ లెక్చరర్ అప్పారావు, ఫ్యాకల్టీ, ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ విద్యార్థులు పాల్గొన్నారు

## మెరుగైన వైద్యం అందించాలి

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**క్షతగాత్రులను పరామర్శించిన కలెక్టర్**




రాజన్న సిరిసిల్ల, జనతా న్యూస్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు.

గంభీరావుపేట మండలం గోరంటల గ్రామ శివారులో కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్ప్రెస్ బస్సు సిరిసిల్లకి వస్తుండగా , గోరంటాల బ్రిడ్జి మూలం వద్దకు రాగానే బ్రేకులు ఫెయిలై ఎదురుగా ఉన్న పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు గాయాలు కాగా, సిరిసిల్ల లోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి( జీజీహెచ్) కు తరలించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ ఆసుపత్రికి చేరుకుని, క్షతగాత్రులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

# యువత సన్మార్గంలో నడవాలి

**డ్రగ్స్ కు బానిస కావొద్దు**

**విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి**

**ఎమ్మెల్యే డాక్టర్ కమ్మంపల్లి సత్యనారాయణ**




**తిమ్మాపూర్, జనతా న్యూస్ :** యువత సన్మార్గంలో నడుచుకుంటూ ఉన్నత లక్ష్యాలకు ఎదగాలని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మండలంలోని వాగేశ్వరి ఫార్మసీ కళాశాల, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రీడలను శుక్రవారం కళాశాల జనరల్ సెక్రెటరీ గంద్ర శ్రీనివాసరెడ్డి తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ... నేటి యువత చెడు అలవాట్లకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటుందని, దీని నుండి యువత దూరం కావాలని సూచించారు. డ్రగ్స్ కు బానిసలు కావద్దని, చెడు అలవాట్లతో ప్రాణాలను కోల్పోతూ తల్లిదండ్రులకు శోకాన్ని మిగిల్చావొద్దని సూచించారు. విద్యతోపాటు క్రీడల్లో రాణించి దేహ దారుఢ్యాన్ని పెంచుకోవాలని తెలిపారు.

విద్యార్థులు, యువత తమ యొక్క సమయాన్ని వృధా చేయకుండా, మంచి నైపుణ్యాలను పెంపొందించుకుంటూ జీవిత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని సూచించారు, కేవలం విద్యలోనే కాకుండా ఆటల్లో సైతం ఎన్నో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. క్రీడల్లో గెలుపు ఓటములు ప్రాధాన్యత కాదని, ఆటల్లో పాల్గొంటూ నైపుణ్యాలను పెంపొందించుకుంటూ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. అనంతరం ఆయన కపోతాన్ని ఎగిరేసి క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు విశ్వనాథ్ వినోద్, ప్రకాష్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి,

నెహ్రూ యువ కేంద్ర ప్రతినిధి హరీష్, బెజ్జంకి మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, నాయకులు రమణారెడ్డి, శ్రీనివాసరావు, కొండలరావు, తిరుపతిరెడ్డి, పోలు రమేష్, పోలు రాము, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గుండె చప్పుడు గద్దర్




### ఘనంగా గద్దర్ 77వ జయంతి వేడుకలు

**కోరుట్ల, జనతా న్యూస్ :** ప్రజల గుండెచప్పుడు గద్దర్ అని ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిలో నిలుస్తాడని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘ నాయకులు అన్నారు. గద్దర్ 77 జయంతి సందర్భంగా శుక్రవారం జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద గద్దర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అనంతరం గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గద్దర్ ప్రజల హక్కుల కోసం పోరాటం చేశారని అన్నారు. ఆయన పాట తూటా లాగా మలిచి ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేశారన్నారు. నిస్వార్థంగా ప్రజా సమస్యలపై గళం విప్పారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆయనను కొంతమంది మనువాదులు, మతోన్మాదులు పలు విమర్శలు చేయడం సరికాదన్నారు. ఆయనకు అవార్డుల గురించి మాట్లాడే అర్హత మనువాదులకు లేదని తెలిపారు. గద్దర్ను అవమానించే విధంగా మాట్లాడేవారికి రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బలిజ రాజారెడ్డి, రాస భూమయ్య, డివిజన్ అధ్యక్షుడు ఉయ్యాల శోభన్, కోశాధికారి భూపల్లి నగేష్, మాల సంఘ అధ్యక్షుడు పొట్ట లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు గోరుమంతల సత్తయ్య, ప్రధాన కార్యదర్శి బలిజ సంతోష్ కుమార్, కోశాధికారి సామల వేణుగోపాల్, సహాయ కార్యదర్శి కండ్లె మైకల్, కార్యవర్గ సభ్యులు ఎడ్ల ప్రభాకర్, చంటి చంద్రబాబు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రాణాలు కాపాడుకోవాలి

**కలెక్టర్ పమేలా సత్పతి**

**ఎస్ఆర్ఆర్ కాలేజీ నుంచి సర్కస్ గ్రౌండ్ వరకు హెల్మెట్ ర్యాలీ**

**ముగిసిన రోడ్డు భద్రత మాసోత్సవం**



**కరీంనగర్ జనతా న్యూస్:** వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రాణాలు కాపాడుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్ఆర్ఆర్ కాలేజీ గ్రౌండ్ లో జెండా ఊపి హెల్మెట్ ర్యాలీని రోడ్ సేఫ్టీ చైర్ పర్సన్, కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం గీతా భవన్ వద్ద ఉన్న సర్కస్ గ్రౌండ్ వరకు హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్కస్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. అతివేగంతో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల బారిన పడవద్దు అన్నారు. వాహనదారులు తమపై ఆధారపడిన కుటుంబ సభ్యులను గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రతినెల అవగాహన కల్పించాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. ఇందుకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ చాహత్ బాజ్ పేయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీటీసీ పురుషోత్తం, డీటీఓ శ్రీకాంత్ చక్రవర్తి, రాజన్న సిరిసిల్ల జిల్లా డీటీవో లక్ష్మణ్, ఎంవీఐలు రవికుమార్, వంశీధర్, ఏఎంవీఐలు హరిత యాదవ్, స్రవంతి, ఆర్టీసీ, ఎక్సైజ్ శాఖ, ట్రాన్స్ పోర్ట్ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, సిబ్బంది, పలువురు వాహనదారులు, ఎన్ సీ సీ కేడేట్లు పాల్గొన్నారు.

## విద్యార్థులు నిరంతరం నేర్చుకుంటూ ముందుకుసాగాలి

**కలెక్టర్ పమేలా సత్పతి**



కరీంనగర్ జనతా న్యూస్: విద్యార్థులు నిరంతరం క్రమశిక్షణతో నేర్చుకుంటూ తమకంటూ ఒక బ్రాండ్ సృష్టించుకునేలా ముందుకు సాగాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సప్తగిరి కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాలలో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ నిర్వాహకులు 8 కంప్యూటర్లతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్కారు బడుల్లో చదివి విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మన ఆర్థిక నేపథ్యాలు ఎలా ఉన్నా.. చదువును నమ్ముకుని ముందుకు సాగితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ అశోక్, హెచ్ఎం రాజేందర్, ఫౌండేషన్ సభ్యులు సూర్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## దళితులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్**

**ప్రణవ్ ను సన్మానించిన దళిత బంధు సాధన సమితి ప్రతినిధులు**



హుజురాబాద్, జనవరి 31 జనతా న్యూస్: హుజురాబాద్ నియోజకవర్గంలో దళితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, దళిత బంధు నిధులను విడుదల చేయడానికి కృషి చేశానని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం హుజురాబాద్ మండలం సింగాపురంలోని అయన నివాసంలో నియోజకవర్గ దళిత బంధు సాధన సమితి సభ్యులు ప్రణవ్ ను కలిసి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. దళిత బంధు రెండవ విడత నిధుల విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేసారని, అయన తమ విజ్ఞప్తి మేరకు అధిష్టానంతో మాట్లాడి దళిత బంధు నిధుల విడుదల చేయడాని కృషి చేశారని తెలిపారు.. ఈ కార్యక్రమంలో దళిత బంధు సాధన సమితి హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి కొలుగూరి సురేష్, కొలుగూరి నరేష్, అకినపల్లి ఆకాష్, ఇనుగాల బిక్షపతి, మహంకాళి రమేష్, రామంచ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ పాత్రికేయుడు కోరెం సుధాకర్‌రెడ్డికి ఎమ్మెల్యే కౌశిక్ పరామర్శ

**అస్వస్థతకు గురైన సుధాకర్ రెడ్డిని ఫోన్లో పరామర్శించిన కౌశిక్**

**హుజూరాబాద్లో ఇళ్ల స్థలాల విషయమై**

**ఆందోళన ఉధృతం చేసిన జర్నలిస్టులు**

హుజురాబాద్, జనవరి 21 జనతా న్యూస్: హుజురాబాద్ పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు కోరెం సుధాకర్ రెడ్డిని శుక్రవారం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఫోన్లో పరామర్శించారు. హుజురాబాద్ శివారులోని కేసీ క్యాంపులో బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయిందింది. దీనిపై కాంగ్రెస్ నేత గూడూరు స్వామి రెడ్డి కోర్టుకు వెళ్లారు. ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులు మంత్రులను కలిశారు. పిసిసి అధ్యక్షునికి కూడా వినతిపత్రం సమర్పించారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ విషయమై గత ఏడాది కాలంగా జర్నలిస్టులు ఆందోళన చేస్తున్నారు. ఇటీవల తెలంగాణ స్టేట్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నగునూరి శేఖర్, జిల్లా అధ్యక్షడు గాండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు ప్రతినిధులు హుజురాబాద్ కు వచ్చి ఇళ్ల పట్టాల సమస్యలపై పాత్రికేయులతో చర్చించారు. పాత్రికేయుల ఇళ్ల స్థలాలపై పోరాటం ఉధృతం చేయాలని తీర్మానించారు. ఈ మేరకు గత నాలుగైదు రోజులుగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. పలు ప్రజా సంఘాలు జర్నలిస్టుల ఆందోళనలకు మద్దతు ఇచ్చాయి. ఇదిలా ఉంటె.. శుక్రవారం హుజురాబాద్ పట్టణంలోని అంబెద్కర్ కూడలివద్ద ప్రెస్ క్లబ్ లో ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనకు సీనియర్ పాత్రికేయుడు కోరెం సుధాకర్ రెడ్డి హాజరయ్యారు. ఆందోళన జరుగుతున్న సమయంలో అస్వస్థతకు గురైన అయన ఒక్క సరిగా కింద పడిపోయారు. దీంతో ఆయనను హుటాహుటిన హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆసుపత్రి నుండి శుక్రవారం రాత్రి డిశ్చార్జ్ అయి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న సుధాకర్ రెడ్డని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఫోన్లో పరామర్శించారు. అయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. జర్నలిస్టులకు బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వంతో, మంత్రులతో చర్చించి ఇళ్ల స్థలాలు కేటాయించామని, దీనిపై కాంగ్రెస్ నేతలు కోర్టుకు వెళ్లడం దురదృష్టకరమని అన్నారు. వెంటనే ప్రభుత్వం, మంత్రులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. జర్నలిస్టులకు న్యాయబద్దంగా ఇవ్వాల్సిన ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అన్నారు. జర్నలిస్టుల ఆందోళనలకు తన మద్దతు ఉంటుందని స్పష్టం చేసారు.

**సమస్య పరిష్కరిస్తా : కాంగ్రెస్ నేత ప్రణవ్**

హుజూరాబాద్లో జర్నలిస్టుల ఆందోళన సందర్భంగా అస్వస్థతకు గురైన సీనియర్ పాత్రికేయుడు కోరెం సుధాకర్ రెడ్డిని స్థానిక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ శుక్రవారం ఫోన్లో పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పాత్రికేయుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



కరీంనగర్ జనతా న్యూస్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది. మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ MLC అభ్యర్థిగా వి.నరేందర్ రెడ్డి ని ఖరారు చేసిందిఈ మేరకు శుక్రవారం ఏఐసీసీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. కాగా, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో 42 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. దాంతో పాటు ఆరు పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో మొత్తం 3.41 లక్షల గ్రాడ్యుయేట్ ఓట్లున్నాయి. ఒకప్పుడు బీఆర్ఎస్‌కు ఈ ప్రాంతం కంచుకోటగా ఉండగా.. తాజాగా ఈ ఎన్నికలకు బీఆర్ఎస్ దూరంగా ఉండటం హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణలో రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.



వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ స్థానంతోపాటు మెదక్– నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ ఉపాధ్యాయ స్థానానికి, మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఏకకాలం లో ఒకే సమయంలో రెండు ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం పట్టభద్రుల నియోజకవర్గం నుంచి టి.జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా రఘోత్తంరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరు ఇరువురి పదవీకాలం మార్చి 29వ తేదీన ముగియనుంది. భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్‌ను అనుసరించి ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్‌నోటిఫికేషన్ జారీ కానుంది. అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలుకానున్నది. ఫిబ్రవరి 11న నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణ, ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. మార్చి 3న ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడిస్తారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

**ఉద్యోగ నిరుద్యోగ పట్టభద్రులకు బాసటగా ఉంటా**

**మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి.**

**కరీంనగర్ జిల్లా కేంద్రంలో అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి విస్తృత ప్రచారం**



కరీంనగర్ జనతా న్యూస్: కరీంనగర్ రానున్న పట్టవద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపిస్తే ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్ కార్డుల మంజూరుకు కృషి చేస్తానని కరీంనగర్ – అదిలాబాద్ –నిజామాబాద్ మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా వి.నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు..శుక్రవారం కరీంనగర్ జిల్లాకేంద్రంలో పలువురు పట్టబద్రులను కలిసి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు పలకాలని కోరారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ నిరుద్యోగపట్టభద్రులకు బాసటగా నిలిచేందుకే ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని వెల్లడించారు.. అల్ఫోర్స్ విద్యాసంస్థల యజమానిగా నేను ఎంతో మంది విద్యార్థులను విద్యావంతులుగా తయారు చేశాను.అన్నారు..రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రంధాల యాల్లో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగు ల సౌకర్యార్థం ప్రభుత్వం పక్షాన మధ్యాహ్న భోజనం ఏర్పాటుకు కృషి చేస్తాననిఅన్నారు.. పట్టభద్రుల సంక్షేమానికి , ఉద్యోగ నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి ఒక విద్యావేత్తగా నిస్వార్థంగా సేవ చేయడానికి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నట్టు..తనను భారీ మెజారిటీతో గెలిపించాలనికోరారు . ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న హెల్త్ కార్డు తో పాటు మినిమం బేసిక్స్ సాలరీ అమలుకు కృషి చేస్తానని అన్నారు.. ప్రైవేటు డిగ్రీ పీజీ కళాశాలల యజమాన్యాలు నిధులు విడుదల కాక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వారి సమస్యల పరిష్కారానికి ఒక పెద్దన్నలానిధుల విడుదలకు సహకరిస్తానని వెల్లడించారు..నిరుద్యోగుల సమస్యల నిర్మూలించేందుకు ఒక సదుద్దేశంతో పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు..తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు.. నిరుద్యోగ య–ువతకు అండగా ఉంటూ ఉద్యోగ రూపకల్పనలో భాగస్వామ్యం అవుతూ ఒక పెద్దన్న పాత్ర పోషిస్తానని అన్నారు.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన జాబ్ క్యాలెండర్ ను అమలు చేసే విధంగాకృషి చేస్తానని పేర్కొన్నారు .. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు అల్ఫోర్స్ ఆధ్వర్యంలో VNR e-CLASSES ధ్వారా ఆన్ లైన్ లో వీడియో క్లాసెస్ , టెస్ట్ పేపర్లు,స్టడీ మెటీరియల్ ను అందచేయడం జరుగుతుందని.. ఈ యాప్ ను డౌన్ లోడ్ కోసం క్యూ ఆర్ కోడ్ ను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతి నిరుద్యోగ యువత ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు ...రానున్న రోజుల్లో గ్రంధాలయాల్లో,బీసీ స్టడీ సర్కిల్ లో తన వంతుగా మరిన్ని మౌళిక సదుపాయాలు కల్పిస్తానని తెలిపారు.. ఎమ్మెల్సీగా గెలిచినా తరువాత నిరుద్యోగ యువత కోసం ప్రతి జిల్లా కేంద్రంలో VNR ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తానని తెలిపారు..రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.. .

## ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలు

**పట్టభద్రులు, టీచర్ల ఓటర్ నమోదు పెండింగ్ దరఖాస్తులను ఫిబ్రవరి 7 లోపు పరిష్కరించాలి**

**ఎమ్మెల్సీ ఎన్నికల పై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి**




కరీంనగర్, జనతా న్యూస్: శాసన మండల సభ్యుల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని అదనపు కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్సీ ఎన్నికల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి పమేలా సత్పతి మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ , నిజామాబాద్ మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రులు, టీచర్స్ శాసన మండలి సభ్యుల స్థానానికి ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందని అన్నారు. ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని, ఫిబ్రవరి 10 వరకు నామినేషన్ల స్వీకరణ, ఫిబ్రవరి 11న స్క్రూట్ ని ఫిబ్రవరి 13 లోపు ఉపసంహరణ గడువు ఉంటుందని, ఫిబ్రవరి 27న పోలింగ్ జరుగుతుందని, మార్చి 3న ఫలితాలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలు చేయాలని, 24 గంటలు , 48 గంటలు, 72 గంటలలో తీసుకోవాల్సిన చర్యల పై రిపోర్ట్ అందించాలని అన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, గోడ రాతలు, జెండాలు, ప్రకటనలు తొలగించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అకౌంటింగ్ బృందాలు, ఎంసిసి బృందాలు, ఫ్లైయింగ్ స్క్వాడ్, వీ.ఎస్.టి , వీ.వి.టి మొదలగు బృందాలను వెంటనే ఏర్పాటు చేయాలని తెలిపారు. మండలాల్లో ఈ రోజు వరకు ఓటర్ నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకొని, పెండింగ్ ఉన్న పట్టభద్రులు, టీచర్స్ ఓటర్ నమోదు దరఖాస్తులను ఫిబ్రవరి 7 లోపు పరిష్కరించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్లు పరిశీలించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణ సమయంలో ప్రచారానికి అవసరమైన అనుమతులను నిబంధనలను ప్రకారం జారీ చేయాలని అన్నారు. ఎన్నికల సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించేందుకు మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేయాలనీ అన్నారు.. ఈ టెలికాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ గందే రాధిక శ్రీనివాస్ సన్మానించిన కేటీఆర్



హుజురాబాద్, జనవరి 31 జనతా న్యూస్: హుజురాబాద్ తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ గందే రాధిక శ్రీనివాస్ ను శుక్రవారం మాజీ మంత్రి, బి అర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్ తెలంగాణ భవన్లో ఘనంగా సన్మానించారు. మున్సిపాలిటీల పదవీకాలం పూర్తయిన సందర్భంగా తెలంగాణ భవన్లో బి ఆర్ ఎస్ పార్టీకి చెందిన మునిసిపల్ చైర్మన్ లను ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా స్థానిక మునిసిపల్ చైర్మన్ గందే రాధిక శ్రీనివాస్ దంపతులను కేటీఆర్, స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. హుజురాబాద్ జమ్మికుంట మున్సిపాలిటీలో బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి గడచిన ఐదేళ్లలో జరిగిందని అన్నారు. హుజురాబాద్ జమ్మికుంట మున్సిపాలిటీలలో జరిగిన అభివృద్ధిని ఆయన కేటీఆర్ కు వివరించారు. కేటీఆర్ హుజురాబాద్ మునిసిపల్ చైర్మన్ గందే శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలకు బిఆర్ ఎస్ పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని, హుజురాబాద్ జమ్మికుంట మున్సిపాలిటీలపై గులాబీ జెండా ఎగరవేస్తామని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు.

## పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**నేరెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



తంగళ్లపల్లి, జనవరి– 31 పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. తంగళ్లపల్లి మండలం నేరెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల ఆవరణ, తరగతి గదులు, మధ్యాహ్న భోజనాలు సిద్ధం చేసే గది, వండే విధానాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం ఈ రోజు ఏ ఏ ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారో ఆరా తీశారు. కూరగాయలు పప్పు, కోడిగుడ్లు సిద్ధం చేస్తుండగా, నాణ్యతను తనిఖీ చేశారు. ఈ రోజు ఎందరు విద్యార్థులు, టీచర్లు హాజరయ్యారో ఆరా తీయగా, మొత్తం 84 మంది విద్యార్థులు, అందరూ టీచర్లు వచ్చారని కలెక్టర్ దృష్టికి ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్ తీసుకెళ్లారు.

**విద్యార్థులకు బోధన**

స్కూల్ లోని 6వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు గదులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా 10 వ తరగతి లో మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీ పాఠాలు బోధించారు. విద్యార్థులకు మ్యాథ్స్ ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. విద్యార్థులను ఉత్తేజ పరిచారు.పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులను సిద్ధం చేయాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ప్రతి పాఠ్యాంశాన్ని క్షుణ్ణంగా వివరించాలని పేర్కొన్నారు.

## ప్రతి సంవత్సరం పోలీస్ క్రీడల నిర్వహణకు కృషి

**పోలీసు క్రీడాకారులను ప్రోత్సహించేందుకే రాష్ట్రస్థాయి పోటీలు.**

**రమేష్ రెడ్డి. ఐజి. స్పోర్ట్స్ తెలంగాణ**

**ఖో ఖో, హాకీ, వాలీబాల్ పోటీలను ప్రారంభించిన ఐజి.**





**కరీంనగర్, జనతా న్యూస్:** గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహణకు నోచుకోని తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడలను ఇకనుంచి ప్రతి సంవత్సరం నిర్వహిం చేందుకు కృషి చేస్తామని ఐజి స్పోర్ట్స్ తెలంగాణ రమేష్ రెడ్డి అన్నారు. కరీంనగర్లో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న మూడవ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడలను శుక్రవారం ఆయన ఖో ఖో,హాకీ, వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించి మాట్లాడారు. జాతీయస్థాయి పోలీస్ క్రీడల్లో తెలంగాణ రాష్ట్ర జట్లు విశేష ప్రతిభ చాటి విజయకేతనం ఎగురవేయాలి అన్నారు. పోలీస్ క్రీడాకారులలో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు, పోలీస్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను నిర్వహిస్తున్నామన్నారు. క్రీడలతో శారీరక అభివృద్ధి మానసిక వికాసం ఉల్లాసం కలుగుతాయని అన్నారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండి క్రీడల్లో పాల్గొనాలన్నారు. రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను ఘనంగా నిర్వహిస్తున్న కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ను ఆయన అభినందించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో హాకీ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. అలాగే సిటిసి మైదానంలో నిర్వహిస్తున్న ఖో ఖో పోటీలను తిలకించారు. ఖో ఖో క్రీడలో మంచి ప్రతిభ చాటుతున్న సిరిసిల్ల జోన్ అంతర్జాతీయ క్రీడాకారుడు వెంకటేష్ ను ఐజి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ డిఎస్పి రామారావు, ఏ సి పి విజయ్ కుమార్, సీఐ మధు, ఎస్సై నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ఇంగ్లండ్‌పై భారత్ ఘన విజయం

## సిరీస్ కైవసం

**పుణె:** ఇంగ్లండ్‌తో 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ కైవసం చేసుకుంది. మరో మ్యాచ్ మిగిలుండగానే 3-1 తేడాతో సిరీస్‌ను తన ఖాతాలో వేసుకుంది. పుణె వేదికగా జరిగిన కీలకమైన నాలుగో మ్యాచ్‌లో 15 పరుగుల తేడాతో విజయబావుటా ఎగురవేసింది. 182 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లండ్ జట్టు 19.4 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. హ్యారీ బ్రూక్ (51) అర్ధ శతకంతో వీరోచిత పోరాటం చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. భారత్ బౌలర్లలో హర్షిత్ రాణా, రవి బిష్ణోయ్ చెరో 3 వికెట్లు పడగొట్టగా, వరుణ్ చక్రవర్తి 2, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్ చెరో వికెట్ తీశారు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమ్ ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది.

### ఓపెనర్లు మెరిపించినా

లక్ష్య ఛేదనకు దిగిన ఇంగ్లండ్ జట్టు ప్రారంభంలో దూకుడుగా ఆడింది. ఓపెనర్లు ఫిలిప్ సాల్ట్ (23), డకెట్ (39) వరుస బౌండరీలు బాదుతూ టీమ్‌ఇండియా గుండెల్లో గుబులు పుట్టించారు. ప్రమాదకరంగా మారిన ఈ జోడీని రవి బిష్ణోయ్ విడగొట్టాడు. జట్టు స్కోరు 62 పరుగుల వద్ద భారీషాట్‌కు ప్రయత్నించిన డకెట్ సూర్యకుమార్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అక్కడికి స్వల్ప వ్యవధిలోనే మరో ఓపెనర్ సాల్ట్ కూడా అక్షర్ పటేల్ చేతిలో బౌల్డయ్యాడు. తొలి డౌన్‌లో వచ్చిన బట్లర్ (2)ను వరుణ్ చక్రవర్తి పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో ఒక్కసారిగా జట్టు కష్టాల్లో పడిపోయింది. తర్వాత క్రీజులోకి వచ్చిన వారిలో ఓవర్టిన్ (19) తప్ప మిగతావారంతా సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు.

### భారత్ టాప్ ఆర్డర్ విఫలమైనా..

ఈ మ్యాచ్‌లోనూ భారత్ టాప్ ఆర్డర్ మరోసారి విఫలమైంది. ఓపెనర్లు సంజు శాంసన్ (1), అభిషేక్ శర్మ (29) తక్కువ పరుగులకే ఔటయ్యారు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ (0), సూర్యకుమార్ యాదవ్ (0) డకౌట్‌గా వెనుదిరిగారు. ఒకే ఓవర్లో మూడు వికెట్లు పడగొట్టి.. మహమూద్ భారత్‌ను తీవ్రంగా దెబ్బతీశాడు. అయితే మూడో డౌన్‌లో క్రీజులోకి వచ్చిన రింకు సింగ్ (30) కాసేపు మెరుపులు మెరిపించాడు. అయితే, జట్టు స్కోరు 79 పరుగుల వద్ద కార్స్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించి రషీద్ చేతికి చిక్కాడు. కానీ ఆల్ రౌండర్లు శివమ్ దూబె (53), హార్దిక్ పాండ్య (53) వీరోచిత ఇన్నింగ్స్ ఆడారు. అర్ధశతకాలతో జట్టును ఆదుకున్నారు.




# అదరగొట్టిన అమ్మాయిలు..

## అండర్-19 టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌కు భారత్



భారత అమ్మాయిలు అదరహో అనిపించారు. అండర్ - 19 మహిళల టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌కు టీమ్‌ఇండియా దూసుకెళ్లింది. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో సెమీస్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 113 పరుగులు చేయగా.. భారత్ 15 ఓవర్లలో కేవలం ఒక్క వికెట్‌ను మాత్రమే కోల్పోయి 117 పరుగులు చేసి గెలుపొందింది. ఓపెనర్లు కమలిని (56లి), గొంగడి త్రిష (35) రాణించారు. దీంతో ఆదివారం జరగనున్న టైటిల్ పోరులో దక్షిణాఫ్రికాతో భారత్ తలపడనుంది.

### ఆడుతూ పాడుతూ..

ఈ టోర్నీలో భారత బ్యాటర్లు తొలి మ్యాచ్ నుంచే మంచి ఫామ్ కనబరిచారు. దానినే కొనసాగిస్తూ సెమీస్‌లోనూ చెలరేగిపోయారు. ఇంగ్లండ్ నిర్దేశించిన స్వల్ప లక్ష్యాన్ని ఆడుతూ పాడుతూ ఛేదించారు. ఓపెనర్లు కమలిని-గొంగడి త్రిష తొలి వికెట్‌కు 60 పరుగులు జోడించి జట్టు విజయానికి పునాది వేశారు. ఈ క్రమంలో త్రిష ఔటైనప్పటికీ భారత ఇన్నింగ్స్‌ను సనికా చల్కే (11లి)తో కలిసి కమలిని ముందుకు తీసుకెళ్లింది. కేవలం 15 ఓవర్లలోనే లక్ష్యాన్ని పూర్తి చేసింది. ఇంగ్లండ్ బౌలర్ ఫోబ్ బ్రెట్ ఒక వికెట్ తీసింది.

### బౌలింగ్‌లోనూ హవా..

టాస్ నెగ్గి బ్యాటింగ్‌ను ఎంచుకున్న ఇంగ్లండ్‌ను భారత బౌలర్లు హడలెత్తించారు. ఓపెనర్ జెమీమా గ్రీస్ (9) రెండు బౌండరీలు కొట్టినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. ఆమె వికెట్‌ను తీసిన ఆయుషి శుక్లా (2/21) ఇంగ్లండ్ పతనానికి నాంది పలికింది. ఆ తర్వాత పరునిక సిసోదియా (3/21), వైష్ణవి శర్మ (3/23) బౌలింగ్‌లో సత్తా చాటారు. డేవినా పెరిన్ (45), కెప్టెన్ అబి నోర్‌గ్రోవ్ (30), అము సురేన్ కుమార్ (14) మినహా మిగతా వారెవరూ రెండంకెల స్కోరు చేయలేదు. దీంతో చివరికి 113 పరుగులకే పరిమితం కావాల్సి వచ్చింది.

### మరో ఫైనలిస్ట్ దక్షిణాఫ్రికా..

అంతకుముందు తొలి సెమీస్‌లో ఆస్ట్రేలియాపై దక్షిణాఫ్రికా పోరాడి విజయం సాధించింది. ఆసీస్ నిర్దేశించిన స్వల్ప లక్ష్య ఛేదనలో సఫారీ జట్టు చెమటోడ్చింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 105/8 స్కోరు చేసింది. దక్షిణాఫ్రికా బౌలర్ ఆష్లే వాన్ వైక్ (4/17) దెబ్బకు ఆసీస్ ఇబ్బంది పడింది. లక్ష్య ఛేదనలో సౌతాఫ్రికా 18.1 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసి విజయంతో ఫైనల్‌కు చేరుకుంది.

# ఆఫ్‌స్టంప్ ఎగిరిపడింది..

## సింగిల్ డిజిట్‌కే విరాట్ కోహ్లీ ఔట్

భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ బ్యాటింగ్‌ను చూద్దామనుకున్న అభిమానులకు ఆ సంబరం కాసేపే దక్కింది. రైల్వేస్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఢిల్లీ తరఫున బరిలోకి దిగిన విరాట్ కోహ్లీ (6) సింగిల్ డిజిట్‌కే పెవిలియన్‌కు చేరాడు. రైల్వేస్ బౌలర్ సంగ్వాన్ బౌలింగ్‌లో ఆఫ్‌స్టంప్ ఎగిరిపడింది. లైన్ అండ్ లెంగ్త్ బంతిని ఆడటంలో విఫలమైన కోహ్లీ వికెట్‌ను సమర్పించాడు. దీంతో దేశవాళీ క్రికెట్ బరిలోకి దిగి విఫలమైన స్టార్ బ్యాటర్ల తాజా జాబితాలో కోహ్లీ కూడా చేరిపోయాడు. ఇంతకుముందు రౌండ్ మ్యాచుల్లో రిషభ్ పంత్, రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ కూడా పరుగులు చేయలేకపోయారు. విరాట్ బ్యాటింగ్‌ను ఆస్వాదిద్దామని వచ్చిన అభిమానులు.. అతడు పెవిలియన్‌కు చేరగానే ఇంటిముఖం పట్టడం ప్రారంభించారు. ప్రస్తుతం ఢిల్లీ 31 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 104 పరుగులు చేసింది. రైల్వేస్ తొలి ఇన్నింగ్స్‌లో 241 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.



### అదొక్కటే మార్గం: భజ్జీ

విరాట్ కోహ్లీ రంజీ బరిలోకి దిగడంపై హర్భజన్ ప్రశంసల వర్షం కురిపించాడు. అయితే, పరుగులు చేయాలంటే మాత్రం కాస్త ఓపిక పట్టాలని సూచించాడు. తొలి ఇన్నింగ్స్‌లో త్వరగానే ఔటైనప్పటికీ కోహ్లీని తక్కువగా అంచనా వేయొద్దని పేర్కొన్నాడు. "విరాట్ కోహ్లీ కుర్రాళ్లకు రోల్‌మోడల్. నేనే విరాట్‌నైతే ఆటను ఆస్వాదించడంపైనే దృష్టిసారిస్తా. ఎప్పుడైతే మనం ఆటను ఎంజాయ్ చేస్తామో.. మన ప్రదర్శన కూడా అత్యుత్తమంగా ఉంటుంది. అయితే, విరాట్ స్థాయికి మనం చేరుకుంటే మాత్రం ఒత్తిడితోపాటు అంచనాలు ముందు వరుసలో నిలుస్తాయి. ఆ తర్వాత ఆస్వాదించడమనేది వెనక సీట్‌లోకి వెళ్లిపోతుంది. కానీ, నేను మాత్రం విరాట్‌ను ముందు ఆటను ఆస్వాదించమనే చెబుతా. ఆ తర్వాత ఎలా ఆడాలి? ఎలా కెరీర్‌ను ముందుకు తీసుకెళ్లాలనేది కుర్రాళ్లకు చెప్పాలని సూచిస్తా. విరాట్ కోహ్లీ ఎక్కువగా పరుగులు చేయాలంటే నేను ఒకటే సూత్రం చెబుతా. క్రీజ్‌లో పాతుకుపోవాలి. కనీసం మూడు లేదా నాలుగు గంటల పాటు క్రీజ్‌లోనే ఉండాలి. అప్పుడే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అలా చేస్తే పరుగులు వాటంతటవే వస్తాయి. తొలి ఇన్నింగ్స్‌లో త్వరగా ఔటైనా కంగారు అవసరం లేదు" అని భజ్జీ తెలిపాడు.




# భారత ప్లేయర్లతో స్నేహం చేయొద్దు

## పాక్ క్రికెటర్లకు మాజీ కెప్టెన్ హెచ్చరిక

ప్రత్యర్థి ఆటగాళ్లపై తనకెలాంటి అగౌరవం లేదని.. కాకపోతే మైదానంలో వారితో స్నేహపూర్వకంగా ఉండటం సరైంది కాదని పాకిస్థాన్ మాజీ కెప్టెన్ మొయిన్ ఖాన్ వ్యాఖ్యానించాడు. అందుకే, తమ ప్లేయర్లను భారత క్రికెటర్లతో స్నేహం చేయొద్దని హెచ్చరించాడు. మైదానంలో పోటీపడేలా ఉండాలని.. అప్పుడే గెలవాలనే పట్టుదల వస్తుందని పేర్కొన్నాడు. గౌరవించడం మంచిదే కానీ, ప్రొఫెషనలిజం కట్టుబాట్లను దాటకూడదని హెచ్చరించాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ -పాకిస్థాన్ జట్లు ఫిబ్రవరి 23న తలపడనున్నాయి. ఈ క్రమంలో మొయిన్ ఖాన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. "ఇటీవల భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌లను చూస్తుంటే ఓ విషయం అర్థం కావడంలేదు. టీమ్‌ఇండియా క్రికెటర్లు క్రీజ్‌లోకి వచ్చినప్పుడు మా ఆటగాళ్లు వెళ్లి వారి బ్యాట్లను చెక్ చేయడం.. వారి భుజాలను తట్టడం, స్నేహంగా మాట్లాడటం చేస్తున్నారు. అలా ఎందుకు చేస్తున్నారో తెలియడం లేదు. ఇక్కడ నేను ప్రత్యర్థి ప్లేయర్లను గౌరవించవద్దని చెప్పడం లేదు. గతంలో మా సీనియర్లు ఒకటే మాట చెప్పేవారు. భారత్‌తో బరిలోకి దిగినప్పుడు ఎలాంటి మినహాయింపులు ఇవ్వకూడదన్నారు. మైదానంలో కనీసం వారితో మాట్లాడటం కూడా చేయొద్దని సూచించారు. ఎప్పుడైతే స్నేహపూర్వకంగా స్పందిస్తామో.. అది మన బలహీనత అనేకొనే ప్రమాదం లేకపోలేదు" అని వ్యాఖ్యానించాడు. "ఇప్పటి రోజుల్లో భారత్‌తో మా ప్లేయర్లు ఆడే తీరు నాకు సరిగ్గా అనిపించడం లేదు. మైదానంలోనే కాదు.. అవతల కూడా ప్రొఫెషనల్స్‌కు కొన్ని పరిమితులు ఉంటాయి. వాటిని తప్పనిసరిగా పాటించాలి. కానీ, మా వాళ్లకు ఇది అర్థంకావడం లేదు. మైదానంలో అలా ఉండటం వల్ల అనవసరమైన ఒత్తిడి తెచ్చుకున్నట్లవుతుంది. అప్పుడు ఆ ప్రభావం ఆటపైనా పడుతుంది. మా తరంలోనూ భారత ఆటగాళ్లను గౌరవించేవాళ్లం. కానీ, దానిని మైదానం వరకూ తీసుకురాలేదు" అని మొయిన్ ఖాన్ స్పష్టంచేశాడు.

# సచిన్ తెందూల్కర్‌కు బీసీసీఐ 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డు!



భారత క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ ను భారత క్రికెట్ బోర్డు ఘనంగా సత్కరించనుంది. శనివారం జరగబోయే వార్షికోత్సవంలో సచిన్‌కు 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం' అందజేయనున్నట్లు పీటీఐకి బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. "సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ ఆఫ్ ది ఇయర్ 2024 అవార్డును సచిన్‌కు ప్రదానం చేయనున్నాం. భారత క్రికెట్‌కు ఆయన అందించిన సేవలు అమోఘం" అని పేర్కొన్నాయి. ప్రపంచ క్రికెట్‌లో రికార్డులు సృష్టించిన సచిన్‌కు అవార్డు ప్రకటనపై పలువురు ప్రశంసిస్తున్నారు. ఈ పురస్కారం స్వీకరించబోయే 30వ భారత క్రికెటర్ సచిన్. గతేడాది భారత మాజీ కోచ్ రవిశాస్త్రి, మాజీ క్రికెటర్ ఫరూఖ్ ఇంజినీర్‌కు ఈ అవార్డు వరించింది.

# ఆకాశ్‌కు విరాట్ సలహా.. ఆ మ్యాచ్‌లో పని చేయలేదు: అశ్విన్




గత ఆస్ట్రేలియా పర్యటనలో భారత్‌కు ఘోర ఓటమి ఎదురైంది. తొలి మ్యాచ్‌లో విజయం సాధించిన టీమ్‌ఇండియా ఆ తర్వాత మూడు మ్యాచుల్లో ఓడి సిరీస్‌ను కోల్పోయింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయింది. ఈ సిరీస్ మధ్యలోనే భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. తాజాగా తన యూట్యూబ్ ఛానల్‌లో వికెట్లు తీయడం, బౌలింగ్ చేయడం మధ్య ఉన్న వ్యత్యాసంపై స్పందించాడు. ఈ క్రమంలో యువ పేసర్ ఆకాశ్ దీప్‌నకు విరాట్ కోహ్లీ ఇచ్చిన సలహా పని చేయలేదని వెల్లడించాడు. "గబ్బా టెస్టులో ఆకాశ్ దీప్ అద్భుతమైన బౌలింగ్ చేశాడు. అతడి కెరీర్‌లో అత్యుత్తమ స్పెల్ అదే అనుకుంటా. నేను బయట నుంచి మ్యాచ్‌ను చూశా. ఇందులో తప్పిదమేమీ లేదు. ఆకాశ్ వద్దకు విరాట్ పరిగెత్తుకుంటూ వెళ్లడం చూశా. 'బంతి స్ట్రెయిట్ గా వెయ్యి' అని సూచించాడు. వెంటనే ఓ ఫీల్డర్‌ను లెగ్ గల్లీలో సెట్ చేశాడు. ఆకాశ్ ప్రత్యర్థి బ్యాటర్ శరీరం లక్ష్యంగా కొన్ని బంతులు వేశాడు. ఆ తర్వాత లెగ్ సైడ్ సంధించాడు. ఫ్లిక్ షాట్లతో పరుగులు వచ్చాయి. ఆకాశ్ బౌలింగ్ లయ దెబ్బతింది. 'నేను ఇబ్బంది పడ్డాను. కాబట్టి స్టీవ్ స్మిత్‌కూ ఇదేతరహాలో బంతిని వేసి ఫలితం రాబట్టొచ్చు' అని విరాట్ కోహ్లీ ఆలోచించి ఉంటాడు. అలా చేసి వికెట్ తీద్దామని అనుకున్నాడు. కానీ, ఆసీస్ బౌలింగ్ వేరు. ఇప్పుడు ఆకాశ్ దీప్ వేసే బౌలింగ్ యాక్షన్ వేరు. అతడు ఎలా వేయాలని భావిస్తాడో.. అదేవిధంగా బౌలింగ్ చేయమని చెబుతాం" అని అశ్విన్ తెలిపాడు. "ఆసీస్ బ్యాటర్ స్టీవ్ స్మిత్‌ను ఔట్ చేసేందుకు చాలా శ్రమించా. అందుకోసం అతడి బ్యాటింగ్‌ను విపరీతంగా చూశా. స్మిత్ బ్యాటింగ్ టెక్నిక్ ఎలా ఉంటుందనేది గమనించా. ఇంట్లో ఉన్నా సరే అదే ధ్యాస. నా భార్య, పిల్లలను కూడా పట్టించుకోలేదు. దీనిని వెనక నుంచి గమనిస్తూ ఉన్న నా భార్య ప్రీతి స్పందిస్తూ 'స్మిత్‌పై ఏమైనా ప్రేమ ఉందా?' అని అడిగింది. స్మిత్ టెక్నిక్ విభిన్నంగా ఉంటుంది. అతడి చేయి వాడే విధానం ప్రత్యేకమైంది. ఒక్కసారి దానిని డిస్టర్బ్ చేస్తే ఫలితం రాబట్టొచ్చని భావించా. 2018/19 సిరీస్‌లో అడిలైడ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో అలానే బంతులేశా. కాస్త ఆలస్యంగా ఆడి స్లిప్‌లో దొరికిపోయాడు" అని భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ వ్యాఖ్యానించాడు.



## ప్రియాంక చోప్రాకు టాప్ రెమ్యునరేషన్

బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా పాపులర్ అమెరికన్ సింగర్ నిక్ జోనస్‌ను పెళ్లి చేసుకున్న తర్వాత హాలీవుడ్‌కు పరిమితమైపోయిందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. లాంగ్ గ్యాప్ తర్వాత ఈ భామ ఆర్ఆర్ఆర్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి, మహేశ్ బాబు కాంబోలో వస్తోన్న గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్ ఎస్ఎస్ఎంబీ 29తో ఇండియన్ సిల్వర్ స్క్రీన్‌పైకి గ్రాండ్ రీఎంట్రీకి రెడీ అయిందని తెలిసిందే.  ఆఫ్రికన్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్‌గా రానున్న ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీ చిత్రీకరణ కొనసాగుతున్నట్టు ఫిలింనగర్ సర్కిల్‌లో ఇప్పటికే వార్తలు రౌండప్ చేస్తున్నాయి. ఇదిప్రియాంకా చోప్రా తెలుగులో ఫుల్ లెంగ్త్ రోల్‌లో నటిస్తోన్న తొలి సినిమా అని తెలిసిందే. ఈ సినిమాకు తీసుకుంటున్న రెమ్యునరేషన్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తాజా కథనాల ప్రకారం జక్కన్న ప్రాజెక్ట్ కోసం ప్రియాంకా చోప్రా ఏకంగా రూ.30 కోట్లు తీసుకుంటుందట. ఇదే నిజమైతే రీఎంట్రీ తర్వాత ప్రియాంకా చోప్రా తీసుకుంటున్న భారీ మొత్తం అవుతుందంటున్నారు సినీ జనాలు. మరి దీనిపై ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందేమో చూడాలి. 2002లో తొలిసారి తమిళ సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ప్రియాంకా చోప్రా ఆ తర్వాత తన ఫోకస్ అంతా బాలీవుడ్‌పైనే పెట్టింది. రాంచరణ్ నటించిన తుఫాన్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు కూడా హాయ్ చెప్పింది.



## కలెక్టర్ కాబోయి యాక్టర్ అయింది

డాక్టర్ కాబోయి..యాక్టర్ అయ్యాను అనే సామేత చాలాకాలం నుంచి మనం వింటూనే ఉన్నాం. కానీ ఓ హీరోయిన్ కలెక్టర్ కాబోయి హీరోయిన్‌గా మారింది. ఆ హీరోయిన్ మరెవ్వరో కాదు.. రాశి ఖన్నా.అవును ఇది నిజం. రాశి ఖన్నా కలెక్టర్ కాబోయి హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. ఆ వివరాల్లోకి వెళ్తే...రాశి ఖన్నా 1990 నవంబరు 30న న్యూఢిల్లీలో జన్మించారు. రాశి ఖన్నా మొదటి నుంచి కూడా బ్రిలియంట్ స్టూడెంట్.స్కూల్లో , కాలేజీలో టాపర్. మధ్యతరగతి కుటుంబానికి చెందిన రాశి ఖన్నా.తొలుత ఉద్యోగం చేయలని భావించింది. అందుకే కలెక్టర్ చదవాలని కోరుకుంది. కొంతకాలం ట్రైనింగ్ తీసుకొని పరీక్షలు కూడా రాసింది. కానీ విఫలం అవ్వడంతో ఆ తర్వాత నటనపై ఆసక్తి పెంచుకొని సినీ రంగం వైపు అడుగులు వేసింది.రాశి ఖన్నా తెలుగు, తమిళం , హిందీ సినిమాలలో నటించారు.ఆమె తన అందం, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. 'ఊహలు గుసగుసలాడే' సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచియమైంది. మొదటి సినిమాతోనే మంచి మార్కులు కొట్టేసింది. 'జోరు', 'జిల్','బెంగాల్ టైగర్', 'శివం', 'సుప్రీం', 'హైపర్', 'జై లవ కుశ', , 'టచ్ చేసి చూడు', 'తొలిప్రేమ', 'శ్రీనివాస కళ్యాణం' తదితర సినిమాల్లో నటించారు.అందానికి అందం , టాలెంట్‌కు టాలెంట్ రాశి ఖన్నా సొంతం. కెరీర్ స్టార్ చేసి పుష్కరకాలం అయినప్పటికీ అమ్మడు కెరీర్‌లో పెద్దగా హిట్లు లేవనే చెప్పాలి. కారణాలు తెలియదు కానీ స్టార్ హీరోలతో నటించే అవకాశం రాశి ఖన్నాకు దక్కలేదనే చెప్పాలి. ఎన్టీఆర్ మినయిస్తే మిగిలిన హీరోలెవ్వరూ కూడా రాశి ఖన్నా వైపు కన్నెత్తి చూడలేదు.



## సినిమాలతో ప్రేమలో పడ్డానేమో!

పాత్రల్ని ఎంచుకోవడం కంటే.. వాటి నుంచి బయటపడడం చాలా కష్టమని అంటోంది కథానాయిక పూజా హెగ్డే. ఎంతో మంది అగ్రతారల సరసన నటించి మెప్పించిన ఈ భామ సందడి తెరపై కనిపించక రెండేళ్లవుతోంది. ఈ ఏడాది వైవిధ్యమైన చిత్రాలతో ఆలోటును భర్తీ చేయడానికి సన్నద్ధమైంది. ప్రస్తుతం ఆమె, బాలీవుడ్ కథానాయకుడు  షాహిద్ కపూర్ జంటగా నటించిన చిత్రం 'దేవా'. ఇందులో పాత్రికేయురాలిగా కనిపించనుంది పూజ. రోషన్ ఆండ్రూస్ తెరకెక్కించిన ఈ థ్రిల్లర్ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న పూజ తన సినీ ప్రయాణం, ఎంచుకునే పాత్రల గురించి కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకుంది. "ప్రస్తుతం నేను ఇటు దక్షిణాదితో పాటు.. హిందీలోనూ వరుస అవకాశాలను అందుకుంటున్నా. ఈ రెండు చిత్రపరిశ్రమలను సమానంగా బ్యాలెన్స్ చేయడం కొంచెం కష్టంగానే ఉంది. కానీ నాకు భాష కంటే నేను ఎంచుకున్న చిత్ర కథ ముఖ్యం. ఈ బాటలో ప్రయాణిస్తేనే ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లు సినిమాల్ని ఎంపిక చేసుకోవచ్చు. ప్రస్తుతం నేను నటించిన 'దేవా', 'రెట్రో' సినిమాల కోసం ఏకకాలంలో చిత్రీకరణలో పాల్గొన్నా. ఇలాంటి సమయంలో సినిమాల కోసం ప్రయాణాలు చేయడం, ఒకే సారి విభిన్న పాత్రల్లోకి మారడం సవాలుగా ఉంటుంది".

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com